విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

- డీఎంహెచ్‌వో వెంకటరమణ

కాశిబుగ్గ, సెప్టెంబరు 10: విధుల్లో నిర్ల క్ష్యం వహిస్తే చర్యలు తప్పవని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ కాజీపేట వెంకట రమణ హెచ్చరించారు. కాశిబుగ్గ పట్టణ ఆరో గ్య కేంద్రాన్ని మంగళవారం తనిఖీ చేశారు. ఆరోగ్య కార్యక్రమాల పనితీరు, పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వర్షాలు విస్తృతంగా కురుస్తున్న కారణంగా సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదముం దని, సిబ్బంది ముందుజాగ్రత్త చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పట్టణ ఆరోగ్య కేం ద్రం పరిధిలో వైద్య శిబిరాలు నిర్వహించి వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచిం చారు. సిబ్బంది ఇంటింటికి వెళ్లి జ్వర సర్వే చేపట్టి, జ్వరంతో బాధపడుతున్న వారి నుంచి రక్త నమూనాలు సేకరించా లన్నారు. డెంగీతో బాధపడుతున్న వ్యక్తి ఇంటికి వెళ్లి పలు సూచనలు చేశారు. అక్కడ చేపడుతున్న యాంటీ లార్వెల్ ఆపరే షన్, ఫైరిత్రం స్ప్రేను పరిశీలించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఏఎంవో శ్రీనివాస్, హెల్త్ సూపర్‌వైజర్ సదానందం, సీవో మోహన్, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

ఆపద వస్తే.. అంతేనా?

- ఏటా ప్రకృతి వైపరీత్యాలతో ఉమ్మడిజిల్లా అతలాకుతలం
- గోదావరి వరదలతో ఏజెన్సీలో భయం భయం
- సకాలంలో సాయం అందక గాలిలో కలుస్తున్న ప్రాణాలు, నీటి పాలవుతున్న ఆస్తులు
- వరంగల్ కేంద్రంగా ఎన్‌డీఆర్‌ఎఫ్ ఏర్పాటుకు డిమాండ్

ఏటా ప్రకృతి వైపరీత్యాలతో ఓరుగల్లు అల్లాడు తోంది. సకాలంలో సహాయక చర్యలు అందకపోతుండ టంతో అనేక ప్రాణాలు గాలిలో కలిసి పోతుండగా.. రూ.కోట్ల విలువైన ఆస్తులు నీటిపాలవుతున్నాయి. విప త్తు కాలంలో అండగా నిలిచే నేషనల్ డిజాస్టర్ రెస్పా న్స్ ఫోర్స్ (ఎన్‌డీఆర్‌ఎఫ్) సేవలకు వరంగల్ దూరమ వడమే ఇందుకు కారణమన్న అభిప్రాయాలు వ్యక్తమ వుతున్నాయి. విజయవాడ కేంద్రంగా ఎన్‌డీఆర్‌ఎఫ్ 10వ బెటాలియన్ ఉండగా, ప్రాంతీయ కేంద్రాన్ని హైదరాబాద్‌లో ఏర్పాటు చేశారు. అయితే ఆపద వచ్చి న సమయంలో ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలు గోదావరి పరివాహక ప్రాంతాలకు, వరంగల్ మహానగరానికి సకాలంలో చేరుకోలేకపోతున్నాయన్న ఆందోళన వ్యక్త మవుతోంది. ఇప్పటికే హైదరాబాద్ కేంద్రంగా స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (ఎస్‌డీఆర్‌ఎఫ్) సేవలు అం దిస్తుండగా, వరంగల్ కేంద్రంగా ఎన్‌డీఆర్‌ఎఫ్‌ను ఏర్పాటు చేయాలనే డిమాండ్ వినిపిస్తోంది.



గతేడాది భారీ వర్షాలకు జలమయమైన నగరం




వరదల్లో మునిగిన ప్రాంతాల నుంచి బాధితులను తీసుకువస్తున్న రెస్క్యూ సిబ్బంది (ఫైల్)

ఎన్‌డీఆర్‌ఎఫ్ సేవలు ఎక్కడ?

ఏటా విపత్తులతో భారీగా ప్రాణనష్టం జరుగుతు న్నా కేంద్ర ప్రభుత్వం తెలంగాణలో నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (ఎన్‌డీఆర్‌ఎఫ్) ఏర్పాటుకు చొరవ చూ పటం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. దేశవ్యా ప్తంగా ఎన్‌డీఆర్‌ఎఫ్ 16 బెటాలియన్లను ఏర్పాటు చేసింది. వీటిలో నాలుగింటిని 2018లో ఏర్పాటు చేయ గా ఉమ్మడి రాష్ట్రంలో విజయవాడ కేంద్రంగా ఎన్‌డీ ఆర్‌ఎఫ్ 10వ బెటాలియన్ ఏర్పాటు చేశారు. ఈ బెటా లియన్‌లో అత్యవసర పరిస్థితుల్లో పని చేయటానికి 18బృందాలను ఏర్పాటు చేశారు. వీటిలో ఏపీలోని కృష్ణా జిల్లాలో 12, విశాఖపట్నంలో రెండు, బెంగళూరు లో రెండు, హైదరాబాద్‌లో ఒక బృందాన్ని ప్రాంతీయ ప్రతిస్పందన కేంద్రానికి (ఆర్‌ఆర్‌సీ)లో నియమించా రు. తెలంగాణలో కేవలం ఒకే బృందం ఉండటంతో ఆపద సమయంలో ఢిల్లీ, విజయవాడల నుంచి ఉమ్మ డి వరంగల్ జిల్లాకు, గోదావరితీర ప్రాంతానికి రప్పిం చుకోవాల్సి వస్తుంది. వీటి అనుమతులకు గంటల సమయం పడుతుండటంతో ఆపదలో పూర్తిగా సాయం అందటం లేదు. ప్రతిఏటా ఎక్కడో ఒకచోట విపత్తులు ఎదురవుతున్నాయి. ఏజెన్సీలో అమాయక రైతులు వాగులు, వరదల్లో చిక్కుకపోయి అవస్థలు పడుతుండగా, కొందరు మృత్యువాత పడుతున్నారు. భూపాలపల్లి సింగరేణి రెస్క్యూ టీమ్‌ను అపద సమ యంలో అత్యవసరంగా వాడుకునే వారు. అయితే సింగరేణి కాకుండా ఇతర చోట్ల జరిగే ప్రమాదాల్లోకి రెస్క్యూ టీమ్ వెళ్లకుండా కొంతవరకు ఆంక్షలు అమలు చేస్తున్నారు. దీంతో సింగరేణి రెస్క్యూ టీమ్ సేవలు అరుదుగా మారాయి. ఇక వరంగల్ గ్రేటర్ కార్పోరేషన్ పరిధిలో డీఆర్‌ఎఫ్ టీమ్‌ను స్థానికంగా ఏర్పా టు చేసి, వరదల సమ యంలో నగర వాసులకు సాధ్యమైనంత వరకు సేవ లు అందిస్తున్నా.. ఎన్‌డీ ఆర్‌ఎఫ్‌కు ఉన్న సామర్థ్యం ఆ బృందాలకు ఉండే అవకాశం లేదనే అభిప్రా యాలు వ్యక్తమవు తున్నా యి. దీంతో ఉమ్మడి వరం గల్ కేంద్రంగా ఎన్‌డీ ఆర్‌ఎఫ్ బెటాలియన్ ఏర్పాటు చేస్తేనే ప్రజల ప్రాణాలకు రక్షణ లభిస్తుందనే చర్చ జరుగుతోంది.



ఈనెల 1న మహబూబాబాద్ శివారు రాళ్లవాగులో చిక్కుకున్న వారిని రక్షిస్తున్న హైదరాబాద్ రెస్క్యూ బృందం



భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం నైన్‌పాక శివారు మోరంచ బ్రిడ్జి పనులు చేస్తూ వరదలో చిక్కుకుపోయిన ఆరుగురు కూలీలను కాపాడడానికి వచ్చిన ఎన్డీఆర్ఎఫ్ హెలికాప్టర్లు (ఫైల్)

ప్రతీ ఏడాది విపత్తులతో విలవిల..

గోదావరితీరంలో ప్రతీ ఏటా వచ్చే విపత్తులతో ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజలు అతాలకుతలం అవు తున్నారు. రాష్ట్రంలో ఎక్కడాలేని విధంగా క్లౌడ్ బరస్ట్‌లు, టోర్న డోలు ఉమ్మడి వరంగల్ జిల్లాలోనే ఏర్పడుతున్నాయి. వాతావరణ మార్పులతో ప్రకృతి కన్నెర్ర చేస్తుండటం ఆందోళన కలిగిస్తోంది. 2020 ఆగస్టు 15న భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలం కుందనపల్లి సమీపంలోని చలివాగులో 12మంది రైతులు చిక్కుకు పోయారు. వాగులో చిక్కుకున్న రైతులను 8గంటల అనంతరం ఎన్డీఆర్ఎఫ్‌కు చెందిన రెండు హెలికాప్టర్ల సాయంతో ఆ రైతులను బయటకు తీసుకొచ్చారు. 2023 జూలై 27వ తేదీన భారీ వర్షాలకు భూపాలపల్లి, ములుగు జిల్లాలో 20మందికి పైగా వరదలో గల్లంతయి మృత్యువాత పడ్డారు. ముఖ్యంగా మోచంవాగు ఉధృతంగా ప్రవహించడంతో భూపాల పల్లి జిల్లా చిట్యాల మండలంలోని నైన్‌పాక శివారు మోరంచపై బ్రిడ్జి పనులు చేస్తున్న అస్సాం, జార్ఖండ్ రాష్ట్రాలకు చెందిన ఆరుగురు కూలీలు వరదలో చిక్కు కున్నారు. ఉదయం 6గంటల నుంచి మధ్యాహ్నం

మిగతా 7వ పేజీలో..

వికసిత్ భారత్‌ను నిర్మిద్దాం

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్
- శివనగర్‌లో బీజేపీ సభ్యత్వ నమోదు

ఖిలావరంగల్, సెప్టెంబరు 10: ప్రధాని నరేంద్రమోదీ ఆధ్వర్యంలో వికసిత్ భారత్‌ను నిర్మిద్దామని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంట రవి కుమార్ పిలుపునిచ్చారు. మంగళ వారం శివనగర్‌లో 170వ, బూత్ అధ్యక్షురాలు మార్త ఉషారాణితో కలిసి డివిజన్‌లో సభ్యత్వ నమో దు కార్యక్రమాలను చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ వికసిత్ భారత్-2047 లక్ష్యా నికి అనుగుణంగా జాతీయస్థాయి నుంచి బూత్ స్థాయి వరకు పా ర్టీని మరింత విస్తరించాలన్నారు. ఇందుకోసం ప్రతీ, నాయకుడు, కార్యకర్త కృషి చేయాలని కోరారు. ఇంటింటికి వెళ్లి బీజేపీ ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.



సభ్యత్వ నమోదు చేపడుతున్న జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్

చాకలి ఐలమ్మను స్ఫూర్తిగా తీసుకోవాలి

- శాసన మండలి వైస్ చైర్మన్ బండా ప్రకాశ్
- నివాళులర్పించిన ఎంపీ, ఎమ్మెల్యేలు, కలెక్టర్లు

న్యూశాయంపేట, సెప్టెంబరు 10 : చాకలి ఐలమ్మను ప్రతీ ఒక్క మహిళ స్ఫూర్తిగా తీసుకోవాలని శాసన మండలి వైస్ చైర్మన్ బండా ప్రకాశ్ పిలుపు నిచ్చారు. తెలంగాణ వీరనారి, సాయుధపోరాట యోధురాలు చాకలి ఐలమ్మ వర్ధంతి హనుమకొండ న్యూశాయంపేట జంక్షన్‌లో ఉన్న ఐలమ్మ విగ్రహం వద్ద మంగళవారం అధికారికంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐలమ్మ విగ్రహానికి శాసన మండలి వైస్ చైర్మన్ బండా ప్రకాశ్, వరంగల్ ఎంపీ కడియం కావ్య, వర్ధన్నపేట, పరకాల ఎమ్మెల్యేలు కే.ఆర్‌నాగరాజు, రేవూరి ప్రకాశ్ రెడ్డి, హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు పి.ప్రావీణ్య, సత్యశారదా దేవి చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు.

అనంతరం బండా ప్రకాశ్ మాట్లాడుతూ.. తెలంగాణ సాయుధ పోరాటంలో ప్రజాస్వామిక పోరాటానికి స్ఫూర్తినిచ్చిన ఐలమ్మ సేవలు, ధైర్యసాహ సాలు ఎంతో గొప్పవన్నారు. ఎంపీ కడియం కావ్య మాట్లాడుతూ.. మహిళా చైతన్యానికి, సాధికారతకు, వెనుకబడిన వర్గాల ఆత్మగౌర వానికి ప్రతీక చాకలి ఐలమ్మ అన్నారు. ఐలమ్మ పోరాట స్ఫూర్తి మనందరికీ ఆదర్శమన్నారు.

హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, మాజీ 'కుడా' చైర్మన్ సుందర్‌రాజ్ యాదవ్, మాజీ జడ్పీ చైర్మన్ సాంబారి సమ్మారావు, స్థానిక కార్పొరేటర్ మామిండ్ల రాజుతోపాటు బీసీ సంక్షేమ శాఖ అధికారులు, రజక సంఘాల నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ కుల సంఘాల నాయకులు తదితరులు ఐలమ్మకు నివాళులు అర్పించారు.



ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి మాట్లాడుతున్న బండా ప్రకాశ్



ఆహ్లాదపరుస్తున్న మాటు మత్తడి

నెక్కొండ మండలం బంజరుపల్లి గ్రామ శివారు సీతారాంపురం మాటు ఆహ్లాదపరుస్తోంది. ఇటీవల కురిసిన వర్షాలకు మత్తడి దూకుతోంది. జలపాతాన్ని తలపిస్తుండటంతో పరిసర గ్రామాల ప్రజలు తరలివచ్చి తిలకిస్తున్నారు. ఎప్పుడు నీరు లేక ఎడారిలా వుండే మాటు మత్తడి పోస్తుండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. యువత సెల్ఫీలు తీసుకుంటూ సందడి చేస్తున్నారు. -నెక్కొండ

వైద్య కళాశాల ప్రారంభానికి సిద్ధం చేయాలి: కలెక్టర్

- నర్సంపేట వైద్య కళాశాల పరిశీలన

నర్సంపేట, సెప్టెంబరు 10 : నర్సంపేట ప్రభుత్వ వైద్య కళాశా లలో ఈ విద్యా సంవత్సరం తరగతుల ప్రారంభానికి ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సత్యశా రద అధికారులను ఆదేశించారు. మంగళవారం పట్టణ శివారులో నూతనంగా నిర్మించిన వైద్య కళాశాల భవన సముదాయంలో ని ఏ, సీ బ్లాక్‌ల్లో ఏర్పాటు చేసి న ఫర్నిచర్, పరికరాలను పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ కళాశాల నిర్వాహణ, ఆస్పత్రిలో సేవ లు అందించేందుకు అవసరమైన బోధన, బోధనేత ర సిబ్బంది ఇతర మౌలిక వసతులు, పరికరాలు, సమకూర్చుకోవాలని స్పష్టం చేశారు. విద్యాసంవత్స రం నుంచి తరగతులు, వైద్యసేవలు అందిం చేందుకు చర్యలు తీసుకోవాలని ప్రిన్సిపాల్ మో హన్‌దాస్‌కు కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్డీవో కౌసల్యాదేవి, జెడ్పీసీఈవో రామిరెడ్డి, జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి పుష్పలత, టీజీఎం ఐడీసీ ఈ ఈ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



నర్సంపేట వైద్య కళాశాలవద్ద ప్రిన్సిపాల్, ఉద్యోగులతో మాట్లాడుతున్న కలెక్టర్

వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలి

వర్షాకాలంలో విద్యార్థులకు అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సత్యశా రద అధ్యాపకులకు సూచించారు. నర్సంపేట పట్టణంలోని మహాత్మాజ్యోతిరావు పూలే బాలికల రెసిడెన్షియల్ గురుకుల పాఠశాలను కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. తరగతి గదులు, భోజ నశా ల, వంటశాల, పిల్లలు నిద్రించే గదులు, మరు గుదొడ్లు, తాగునీటి ప్లాంట్‌ను పరిశీలిం చారు. టాయిలెట్ల వద్ద పరిశుభ్రత పాటించాలన్నారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన ఫిర్యాదుల పెట్టెను కలెక్టర్ స్వయంగా తెరిచి పరిశీలించారు. తరగతి గదుల్లో డిజిటల్ క్లాస్ బోర్డును పరిశీలించి విద్యా ర్థులకు సిలబస్ ఎంతవరకు పూర్తయిందని ప్రశ్నిం చారు. జిల్లాలో వర్షాలు కురుస్తున్నందున పాఠశాల ఆవరణలో నీరుచేరి దోమలు వ్యాప్తి చేందకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తాగునీటి ప్లాంటును ఎప్పటికప్పుడు శుభ్రపరచాలని సూచిం చారు. విద్యార్థులకు వడ్డించే ఆహారం కలుషితం కాకుండా చూడాలన్నారు. సిలబస్ పూర్తి చేసి ప్రతీ విద్యార్థి ఉత్తమ ఫలితాలు సాధించేలా కృషి చేయా లన్నారు. కలెక్టర్ వెంట జిల్లా బీసీ సంక్షేమ అధికారి పుష్పలత, వార్డెన్, ఉపాధ్యాయులు ఉన్నారు.

రిటైర్డ్ రైల్వే ఉద్యోగి ఆత్మహత్య

మడికొండ, సెప్టెంబరు 10 : కుటుంబ కలహాలతో గడ్డి మందు తాగి రిటైర్డ్ రైల్వే ఉద్యోగి మృతి చెందాడు. మడికొండ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక చెరువు కట్ట కాలనీకి చెందిన రిటైర్డ్ రైల్వే ఉద్యోగి రాయికంటి మొగిలి(64) కుంటుబ అవసరాల కోసం లోన్ ద్వారా అప్పు తీసుకున్నాడు. డబ్బులను కొంత మందికి అప్పుగా ఇస్తూ ఖర్చు చేస్తుండగా పిల్లల చదువుల కోసం తీసుకున్న డబ్బులు ఇతరులకు ఇస్తూ ఇలా ఖర్చు చేస్తే ఎలా అని భార్యా భర్తలమధ్య గొడవ జరిగింది. దీంతో క్షణికావేశానికి లోనైన మొగిలి.. మంగళవారం ఉదయం గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన భార్య, కుమారులు వెంటనే నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సాయంత్రం మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు. భార్య శ్రీలత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రిటైర్డ్ ఐటీఐ ప్రిన్సిపాల్ మృతి

కాజీపేట, సెప్టెంబరు 10: కాజీపేట 61వ డివిజన్ ప్రశాంత్‌నగర్‌కు చెందిన వరంగల్ ఐటీఐ రిటైర్డ్ ప్రిన్సిపాల్, ముదిరాజ్ సంఘం నేత దండబోయిన సారయ్య(67) ముదిరాజ్ అనారోగ్యంతో మంగళవారం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మంచిర్యాల, సుల్తానాబాద్, వరంగల్, ప్రభుత్వ ఐటీఐలలో ప్రిన్సిపాల్‌గా పనిచేసి ఉద్యోగ విరమణ పొందారు. తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ మహాసభ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. భౌతికకాయాన్ని ప్రశాంత్‌నగర్‌లోని వారి నివాసంలో మంగళవారం ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రావుల జగదీశ్వర్ ప్రసాద్, జిల్లా నాయకులు పెండ్యాల సారంగపాణి, డి. లక్ష్మీనారాయణ తదితరులు దర్శించి పూలమాలలు వేసి నివాళులు అర్పించి సంఘం కోసం ఆయన చేసిన సేవలు కొనియాడారు. సారయ్య అంత్యక్రియలు బుధవారం హనుమకొండ పద్మాక్షిశ్మశాన వాటికలో జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు. భార్య, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

గుట్కా పట్టివేత

వరంగల్ క్రైం, సెప్టెంబరు 10: వరంగల్ ఇంతేజార్‌గంజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇద్దరు వ్యక్తుల వద్ద రూ.15వేల విలువ కలిగిన గుట్కాలను టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకుని ఇద్దరిని అరెస్టు చేశారు. స్టేషన్ పరిధిలోని జయ బాలాజీ కిరాణం షాపు యజమాని హరితేజ వద్ద రూ.10,250, సిగరెట్ సేల్స్‌మెన్‌గా పనిచేస్తున్న కృష్ణ వద్ద రూ.5వేల విలువకలిగిన గుట్కాను పట్టుకున్నారు. ఇద్దరిని విచారణ నిమిత్తం స్థానిక పోలీసులకు అప్పగించారు. ఈ విషయాన్ని టాస్క్‌ఫోర్స్ సీఐ రవికుమార్ ధ్రువీకరించారు.

చెన్నై సదస్సులో ప్రొఫెసర్ సవితాజ్యోత్స్న

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 10: సెప్టెంబరు 2 నుంచి 7 వరకు చెన్నైలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో నిర్వహించిన ప్రతిష్టాత్మక 18వ ఇంటర్నేషనల్ కాంగ్రెస్ థర్మల్ ఎనిలిసిస్ అండ్ కాలోరిమెట్రీ 2024 సదస్సుకు కేయూ కెమిస్ట్రీ విభాగాధిపతి ప్రొఫెసర్ టి.సవితాజ్యోత్స్న హాజరయ్యారు. థర్మోడినమిక్ అండ్ డీఎఫ్‌టీ స్టడీస్ బిట్‌విన్ 1, 2 ఇథియలిడిమిక్ అండ్ 1,5 పెంటనిడిల్ ఎట్ టీ293.15 టూ 313.15కే అనే అంశంపై పరిశోధన పత్రాన్ని సమర్పించారు. అంతర్జాతీయ, జాతీయ స్థాయి సైంటిస్టులు పాల్గొన్న ఈ సదస్సులో సవితాజ్యోత్స్న టెక్నికల్ సెషన్‌కు అధ్యక్షులుగానూ వ్యవహరించారు.

కేయూ భూములపై అధికారుల విచారణ

● జాయింట్ ఇన్‌స్పెక్షన్ కమిటీగా ఏర్పడి సమగ్ర సర్వేలు ● నివేదిక అందజేయనున్న అధికారులు



వర్సిటీలో విచారణ చేస్తున్న విజిలెన్స్, ఇన్స్‌పోర్స్‌మెంట్ అధికారులు

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 10: కాకతీయ యూనివర్సిటీ భూకబ్జాలపై విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులతోపాటు రెవెన్యూ, సర్వే, మునిసిపల్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. వర్సిటీ భూములను అందినకాడికి అందినట్లు ఆక్రమించుకుని అక్రమ నిర్మాణాలు చేపట్టిన బడావ్యక్తుల కబ్జాల బాగోతాలను ఆధారాలతో సహా బయటపెట్టేందుకు సమగ్ర సర్వే చేపట్టారు. ఈ మేరకు మంగళవారం వర్సిటీలోని కబ్జాలకు గురైన భూములను అధికారులు జాయింట్ ఇన్‌స్పెక్షన్ కమిటీగా ఏర్పడి సమగ్ర సర్వేలు చేపట్టారు. రెండు రోజుల విచారణలో భాగంగా తొలిరోజు మంగళవారం వర్సిటీ న్యూ పీజీ హాస్టల్ పక్కన బీసీ కాలనీలోని 229 సర్వే నెంబర్‌లో సర్వే చేపట్టారు. మునిసిపల్ అధికారులు బీసీ కాలనీల్లోని పలువురికి భూ ఆక్రమణలపై నోటీసులు జారీ చేయడంతో వారు అధికారుల ఎదుట హాజరై తమ వాదనలు వినిపించారు. విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ రాకేశ్ నేతృత్వంలో వర్సిటీ భూముల పాత సర్వే రిపోర్టులు, వర్సిటీ డెవలప్‌మెంట్ అధికారుల వద్ద ఉన్న దస్తావేజులను పరిశీలించారు. వర్సిటీది మొత్తం ఎంత భూమి వుంది..? ఏ సర్వే నెంబర్‌లో ఉండేదని గుర్తించారు. ఆక్రమణలు ఎక్కడెక్కడ జరిగాయనే విషయంలో అధికారులు సమగ్రంగా పరిశీలన చేపట్టారు. వర్సిటీల్లో భూముల్లో నిర్మించిన అక్రమ భవనాలు, ఇతర కట్టడాలను గుర్తించారు. వర్సిటీలోని ఇంచు భూమి కూడా ఆక్రమణకు గురికావొద్దని విద్యార్థి సంఘాల నేతలు వర్సిటీలోకి వచ్చిన విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులను కలిసి వినతి పత్రాలను అందచేశారు.

నేడు అధికారుల నివేదికలు

కాకతీయ యూనివర్సిటీలోని భూ కబ్జాల పర్వాలపై మంగళవారం మొదటి రోజు విచారణ చేపట్టిన అధికారులు.. రెవెన్యూ, సర్వే అధికారులతో కలిసి నివేదిక రూపొందించనుంది. బుధవారం రెండో రోజు కూడా వర్సిటీలో భూ కబ్జాలపై విచారణ చేస్తారు. అనంతరం విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు, రెవెన్యూ, సర్వే అధికారులు కబ్జాలపై సమగ్ర నివేదికను రూపొందించి వర్సిటీ ఇన్‌చార్జి వీసీ వాకాటి కరుణ, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, వర్సిటీ డెవలప్‌మెంట్ అధికారి ప్రొఫెసర్ ఎన్.వాసుదేవారెడ్డిలకు అందచేస్తారు. విచారణ అధికారుల నివేదిక ఆధారంగా వర్సిటీలో ప్రహరీ నిర్మాణం తొందరగా చేపట్టే అవకాశం ఉంది.

వర్సిటీ భూములను మింగేసే కుట్ర

కాకతీయ యూనివర్సిటీ భూములను మింగేసే కుట్రలో భాగంగానే వర్సిటీలో కబ్జాలపై ఉన్న భూముల రిపోర్టులను పక్కన పెట్టి మళ్లీ సర్వేల పేరుతో కుట్రలు పన్నారనే ఆరోపణలు వర్సిటీలో వెల్లువెత్తుతున్నాయి. వర్సిటీ భూముల కబ్జాల బాగోతాలపై గతంలో కలెక్టరేట్ ఉన్నతాధికారులు అధికారులు, వర్సిటీ పాలక మండలి సభ్యుల సమగ్రంగా వర్సిటీ భూముల దస్తావేజులను రెవెన్యూ సర్వేలు, రిపోర్టులను చూసి కబ్జాల పర్వాలపై సమగ్రమైన నివేదికలను అందచేశాయి. వర్సిటీ భూములు కబ్జాలకు గురయ్యాయనే విషయం అప్పట్లోనే ఆయా అధికారుల నివేదికలతో స్పష్టమైంది. అయితే అప్పటి వర్సిటీ మాజీ వీసీతోపాటు వర్సిటీలో పలుకుబడి కలిగిన అధికారులు ఆయా రిపోర్టులను కనీసం బయటికి తీయలేదు. కబ్జాలపై ఉన్నటువంటి సమగ్ర రిపోర్టులను అమలు చేయకుండా మళ్లీప్పుడు తాజాగా రెవెన్యూ, విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్, మునిసిపల్ అధికారులందరితో సర్వేలు చేపట్టారు. ఈ సర్వేలపై పేరుతో వర్సిటీ భూములపై ఆటలాడుకుంటున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వర్సిటీ చుట్టూ ప్రహరీ నిర్మాణానికి గతంలోనే వర్సిటీ అధికారులు రూ.10కోట్లు కేటాయించారు. పనులను మధ్యలో ఆపేసి భూముల విచారణ పేరుతో కాలయాపన చేస్తున్నారని వర్సిటీ వర్గాలు ఆరోపిస్తున్నాయి. భూములపై డబుల్ సర్వేలు చేపట్టి ఎవరిని కాపాడుతున్నారని విద్యార్థి సంఘాల నేతలు అధికారులు ప్రశ్నిస్తున్నారు.

రేపు గురుకుల పాఠశాలలో స్పాట్ అడ్మిషన్లు

మడికొండ, సెప్టెంబరు 10: వరంగల్ రీజియన్ హనుమకొండ, వరంగల్, భూపాలపల్లి, ములుగు జిల్లాల పరిధిలో ఉన్న తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలల్లో 5 నుంచి 9వ తరగతి వరకు మిగిలిపోయిన సీట్లను భర్తీ చేసేందుకు ఈనెల 12న మడికొండ బాలుర సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు డీసీవో దాసరి ఉమామహేశ్వరి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల తల్లిదండ్రులు తమ పిల్లల కులము, ఆదాయం, నివాసం, ఆధార్, స్టడీ సర్టిఫికెట్లతో ఉదయం 10 గంటలకు నేరుగా మడికొండ గురుకుల పాఠశాలకు రావాలని తెలిపారు. ఎంట్రెన్స్ రాసిన హాల్‌టికెట్ వెంట తీసుకురావాలని తెలిపారు. వివరాలకు 99498 92426, 76809 06134 నంబర్లలో సంప్రదించాలని డీసీవో కోరారు.

ఇంటర్ ప్రవేశాల గడువు పొడిగింపు

వరంగల్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 10: ఇంటర్‌లో ఫస్టియర్‌లో ప్రవేశాల గడువును పొడిగించినట్లు వరంగల్, హనుమకొండ డీఐఈవోలు ఎ.గోపాల్, డాక్టర్ జి.సుమన్ శ్రీధర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బోర్డు నిర్దేశించిన ప్రవేశాల గడువు ఈ నెల 7తో ముగియగా ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా ఈ నెల 15 వరకు ప్రవేశాలకు అవకాశం కల్పిస్తున్నట్లు బోర్డు అధికార వర్గాలు ఆదేశాలు జారీ చేసినట్లు వారు పేర్కొన్నారు. ఇప్పటికీ ఇంకా ప్రవేశాలు పొందని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వ్యభిచార గృహంపై టాస్క్‌ఫోర్సు దాడి

వరంగల్ క్రైం, సెప్టెంబరు 10: కాకతీయ యూనివర్సిటీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గోపాల్‌పూర్‌లోని శివసాయి కాలనీలోని ఓ ఇంట్లో వ్యభిచారం నిర్వహిస్తున్న మహిళను, ఓ విటుడిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. వేలేరు మండలానికి చెందిన ఓ మహిళ శివసాయి కాలనీలో ఇల్లు అద్దెకు తీసుకుని ఇతర రాష్ట్రాలనుంచి మహిళలను తీసుకువచ్చి ఏడాదిగా వ్యభిచార దందా నిర్వహిస్తోంది. స్థానికుల నుంచి సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు.. కేయూ పోలీసులతో కలిసి మంగళవారం ఆ గృహంపై దాడి చేసి మహబూబాబాద్ జిల్లాకు చెందిన ఓ విటుడిని అదుపులోకి తీసుకున్నారు. నిర్వాహకురాలిని అరెస్టు చేసి విచారణ నిమిత్తం కేయూ పోలీసులకు అప్పగించారు. ఈ విషయాన్ని టాస్క్‌ఫోర్స్ సీఐ రాజు ధ్రువీకరించారు.

ఉపాధి కార్యాలయంలో రేపు జాబ్ మేళా

వరంగల్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 10: వరంగల్ జిల్లా ఉపాధి కల్పన, శిక్షణశాఖ ఆధ్వర్యంలో గురువారం జాబ్‌మేళాను నిర్వహిస్తున్నట్లు ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ సీహెచ్. ఉమారాణి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌లోని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో వర్చువల్ కేర్ విభాగంలో 50 ఖాళీలకు, ఎస్ బ్యాంక్‌లోని సీనియర్ ఆఫీసర్లు 20 ఖాళీలకు, ముత్తూట్ ఫైనాన్స్ హైదరాబాద్, వరంగల్‌లోని బిజినెస్ డెవలప్‌మెంట్ ఎగ్జిక్యూటివ్స్ 20ఖాళీలకు, శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ ఉమ్మడి వరంగల్ జిల్లాలో బిజినెస్ డెవలప్‌మెంట్ ఎగ్జిక్యూటివ్స్ 30 ఖాళీలకు, బిజినెస్ డెవలప్‌మెంట్ మేనేజర్స్ 20ఖాళీలకు జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. ఏదైనా డిగ్రీ పాసైన 22 నుంచి 35 ఏళ్లలోపుగల అభ్యర్థులు వారి సర్టిఫికెట్లతో ములుగురోడ్‌లోని ప్రభుత్వ ఐటీఐ ప్రాంగణంలోని జిల్లా ఎంప్లాయిమెంట్ ఆఫీస్‌లో ఉదయం 11 గంటలకు హాజరు కావాలని ఆమె కోరారు.

13న మినీ జాబ్ మేళా

హనుమకొండ జిల్లా ఎంప్లాయింట్ అండ్ ట్రైనింగ్ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం మినీ జాబ్‌మేళాను నిర్వహిస్తున్నట్లు ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ ఎం.మల్లయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వే టూ న్యూస్ వరంగల్, హనుమకొండలో సేల్స్ ట్రెయినీలు 15 ఖాళీలు, భారత్ ఫైనాన్సియల్ ఇన్క్లూషన్‌లో లోన్ ఆఫీసర్లు 40 ఖాళీలు, ఆదర్శ మారుతీ సుజుకీ ములుగురోడ్‌లోని షోరూమ్‌లో టెలీకాలర్లు, డ్రైవర్లు 5 ఖాళీలకు జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. అభ్యర్థులు డిగ్రీ, ఎంబీఏ, ఇంటర్, ఐటీఐలో ఉత్తీర్ణులై 18 నుంచి 35 ఏళ్ల వయస్సుగల వారు జాబ్ మేళాలో పాల్గొనవచ్చునని తెలిపారు. అర్హత, ఆసక్తిగల అభ్యర్థులు శుక్రవారం ములుగురోడ్‌లోని ప్రభుత్వ బాలుర ఐటీఐలో నిర్వహించే జాబ్ మేళాలలో వారి సర్టిఫికెట్లతో ఉదయం 11గంటలకు హాజరు కావాలని ఆయన కోరారు.

కేయూ దూరవిద్య పరీక్షల రీ షెడ్యూల్ వెల్లడి

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 10: కాకతీయ యూనివర్సిటీ దూరవిద్య కేంద్రం అందిస్తున్న బీఎల్ఐఎస్సీ, ఎంఎస్‌డబ్ల్యూతో పాటు ఇతర పరీక్షల రీ షెడ్యూల్‌ను మంగళవారం కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ శ్రీరామోజు నరసింహాచారి, దూరవిద్య కేంద్రం డైరెక్టర్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎ.నరేందర్ మంగళవారం తెలిపారు. మాస్టర్ ఆఫ్ సోషల్ వర్క్స్(ఎంఎస్‌డబ్ల్యూ), ఫైనల్ ఇయర్‌వైజ్, నాలుగో సెమిస్టర్ పరీక్షలు సెప్టెంబరు 90న మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు, అలాగే బీఎల్ఐఎస్సీ ఎక్స్ అభ్యర్థులకు 18 సెప్టెంబరు మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు, బీఎల్ఐఎస్సీ మొదటి సెమిస్టర్ పరీక్షలు జరుగుతాయని తెలిపారు. సోషల్ వర్క్స్ అభ్యర్థులకు కేయూక్యాంపస్‌లోని ఎడ్యుకేషన్ కళాశాల, బీఎల్ఐఎస్సీ అభ్యర్థులకు కేయూ కోఎడ్యుకేషన్ ఇంజనీరింగ్ కళాశాలలో పరీక్షల కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఇతర వివరాలకు దూరవిద్య కేంద్రంలో సంప్రదించాలని కోరారు.

అన్నం వండలేదని తమ్ముడిపై దాడి

నర్సంపేట టౌన్, సెప్టెంబరు 10 : అన్నం ఎందుకు వండలేదంటూ తోడబుట్టిన తమ్ముడిపై అన్న కత్తితో దాడికి పాల్పడిన ఘటన వరంగల్ జిల్లా నర్సంపేటలోని రాంనగర్‌లో మంగళవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. రాంనగర్‌కు చెందిన దుర్గం ధర్మి-శోభ దంపతులకు ఇద్దరు కుమారులు అమర్, దేవేందర్ ఉన్నారు. ధర్మి, శోభలు దంపతులు గతంలోనే మృతిచెందారు. అన్నదమ్ములు అవివాహితులు కాగా, ఓ అద్దె ఇంట్లో ఉంటూ జీవనం సాగిస్తున్నారు. అమర్ మటన్ షాపులో గుమస్తాగా పనిచేస్తుండగా, దేవేందర్ భవన నిర్మాణ కార్మికుడిగా అప్పుడప్పుడు వెళ్తూ మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో మంగళవారం మధ్యాహ్నం అమర్ పనిచేసే షాపు వద్దకు మద్యం మత్తులో ఉన్న దేవేందర్ వెళ్లి ఇంట్లో అన్నం ఎందుకు వండలేదంటూ ఆగ్రహం వ్యక్తం చేశాడు. దీంతో మాటామాటా పెరిగింది. అదే సమయంలో దేవేందర్ పక్కనే ఉన్న కత్తిని తీసుకొని దాడి చేయగా అమర్‌కు కడుపులో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే నర్సంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్య చికిత్సల కోసం ఎంజీఎంకు వైద్యులు రెఫర్ చేశారు. ఈ విషయంపై స్థానిక పోలీసులను సంప్రదించగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు.



అమర్‌కు నర్సంపేట ఆస్పత్రిలో ప్రథమ చికిత్స చేస్తున్న వైద్యులు

కళలను మరింత ఆదరించాలి

మయూరి నాట్య కళా వేడుకల్లో వేదాంతం రాధేశ్యామ్

హనుమకొండ కల్చరల్, సెప్టెంబరు 10: విశ్వ జనీనమైన కళలను ఆదరిస్తూ కళాకారులను మరింతగా ప్రోత్సహించాల్సిన ఆవశ్యకత ఉందని ప్రఖ్యాత నాట్యాచార్యుడు, రాష్ట్రపతి అవార్డు గ్రహీత, కూచిపూడి అగ్రహారానికి చెందిన డాక్టర్ వేదాంతం రాధేశ్యామ్ పేర్కొన్నారు. సోమవారం రాత్రి నగరంలోని కిట్స్ ఇంజనీరింగ్ కళాశాల ఆడిటోరియంలో నేత్రపర్వంగా జరిగిన మయూరి నాట్యకళా కేంద్ర 17వ వార్షికోత్సవ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రముఖ నటుడు, కళాకారుడు, రిటైర్డ్ విద్యాశాఖాధికారి బూర విద్యాసాగర్‌గౌడ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాధేశ్యామ్ మాట్లాడుతూ.. కూచిపూడి నృత్యం విశ్వవ్యాపితమైందన్నారు. కళలకు భాషా, ప్రాంతీయ భేదాలుండవని చెబుతూ అన్ని మెళకువలను నేర్చుకొని నృత్య రంగంలో రాణించేందుకు కృషి చేయాలన్నారు. కళలకు కాణాచి అయిన ఓరుగల్లులో దశాబ్దంన్నర కాలంగా వందలాది చిన్నారును నాట్యరంగంలో తీర్చిదిద్దుతున్న కుండె అరుణరాజ్‌కుమార్‌ను ఆయన ప్రశంసించారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లలకు చదువుతో పాటు ఇతర కళారంగంలోనూ ప్రోత్సహించాలన్నారు. బూర విద్యాసాగర్‌గౌడ్ అధ్యక్షోపన్యాసం చేస్తూ కళాకారులుగా రాణిస్తూ భవిష్యత్ కళాకారులను తయారు చేసేందుకు కృషి చేయాలన్నారు. వందలాది మంది నాట్య కళాకారులను తయారు చేస్తున్న అరుణ అభినందనీయురాలన్నారు.



మాట్లాడుతున్న కూచిపూడి నాట్యాచార్యులు రాధేశ్యామ్

ఈ వేడుకల్లో దేవాదాయ శాఖ సహాయ సంచాలకురాలు రాయల సునిత, చక్రవర్తి హాస్పిటల్స్ డాక్టర్ తరుణ్, సంగీత కళాకారుల సంఘం అధ్యక్షుడు సీతాల రఘువేందర్, కిట్స్ సూపరింటెండెంట్ పొట్లపల్లి ప్రసాదరావు, మేకల రమేష్, రోజా క్రియేషన్స్ ఆలేటి శ్యాంసుందర్, పెండెం వేణుమాధవరావు, టి. నరేందర్, పెరుమాండ్ల వెంకట్, తదితరులు అతిథులుగా పాల్గొన్నారు. మయూరి నాట్య కళాక్షేత్రం నిర్వాహకులు కుండె అరుణరాజ్‌కుమార్ స్వాగతం పలికారు. తొలుత ఈ వేడుకలను పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి జ్యోతి వెలిగించి ప్రారంభించారు. నా తల్లే నా దైవం శీర్షికన ప్రారంభమైన వేడుకల పరంపరంలో కుండె కొమురమ్మను ఎమ్మెల్యే రేవూరి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కళాక్షేత్రం విద్యార్థినులు శ్రీకృష్ణ రమణీయం, శివతాండవం లాస్యం లాంటి అనేక నృత్య రూపకాలు, నృత్యాలు ప్రేక్షకులకు కనువిందు చేశాయి.

పార్టీ ఫిరాయింపులపై మాట్లాడే అర్హత బీఆర్‌ఎస్‌కు లేదు

హైకోర్టు తీర్పుపై న్యాయనిపుణులతో చర్చిస్తాం..

అవసరమైతే సుప్రీం కోర్టుకు వెళ్తాం..

స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి

స్టేషన్‌ఘన్‌పూర్, సెప్టెంబరు 10: పార్టీ ఫిరాయింపులపై మాట్లాడే నైతిక హక్కు బీఆర్‌ఎస్‌కు, ఆ పార్టీ నేతలకు లేదని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి పేర్కొన్నారు. డివిజన్ కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్నప్పుడు పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించి ప్రతిపక్షపార్టీల శాసనసభాపక్షాలను విలీనం చేసుకున్న నీచచరిత్ర బీఆర్‌ఎస్‌ది అని మండిపడ్డారు. 2014 నుంచి 2023 వరకు వివిధ రాజకీయ పార్టీల నుంచి 32 మంది ఎమ్మెల్యేలను బీఆర్‌ఎస్‌లో చేర్చుకున్నారని ఏ ఒక్కరు వారిలో డిస్ క్వాలిఫై కాలేదన్నారు. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలకు మంత్రి పదవులు సైతం ఇచ్చారని, రాజీనామాలు చేయకుండానే తలసాని శ్రీనివాస్ యాదవ్, సబితా ఇంద్రారెడ్డి మంత్రులయ్యారని గుర్తు చేశారు. పెద్ద ఎత్తున పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించిన బీఆర్‌ఎస్ పార్టీ సిగ్గులేకుండా మాట్లాడుతుందన్నారు. హైకోర్టు తీర్పుతో లొట్టపెట్ట పెదవులకు నక్క ఆశపడ్డట్లుగా కొందరు ఉప ఎన్నికలు వస్తాయని మాట్లాడుతున్నారని వారి అజ్ఞానానికి జాలిపడుతున్నానని తెలిపారు. ఎవరు ఎన్ని ఆశలు పెట్టుకున్నా ఉప ఎన్నికలు రావని తేల్చి చెప్పారు. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై హైకోర్టు తీర్పు ఇచ్చిందని అయితే తీర్పుకు సంబంధించిన ఒరిజినల్ కాపీ తమకు అందలేదని కేవలం పత్రికల్లో చూశామని తెలిపారు. తీర్పుకు సంబంధించిన ఒరిజినల్ కాపీ అందిన తరువాత విషయమై పార్టీ పెద్దలతో, న్యాయ నిపుణులతో చర్చించిన తరువాత భవిష్యత్ కార్యాచరణ ఉంటుందన్నారు. పార్టీ ఫిరాయింపులపై గతంలో, ప్రస్తుతం హైకోర్టు, సుప్రీంకోర్టులు రెండు భిన్నమైన తీర్పులు ఇస్తున్నాయన్నారు. కోర్టులను గౌరవించే బాధ్యత తమకుందన్నారు. డివిజన్ బెంచ్‌ను ఆశ్రయిస్తామని, అవసరమైతే సుప్రీంకోర్టుకు వెళుతామన్నారు. ఏమో అయినట్లు ఎన్నికలు వచ్చినట్లు కొందరు బీఆర్‌ఎస్ నాయకులు ఆశపడుతున్నారని ఎద్దేవా చేశారు. కొందరు పగటి కలలు కనడం వారి అజ్ఞానికి, దిగజారుడుతనానికి నిదర్శనమన్నారు. ఘన్‌పూర్ నియోజకవర్గ ప్రజలు తనపై నమ్మకంతో గెలిపించారని ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు విమర్శకుల నోళ్లు మూయించేలా నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి చూపిస్తానని తెలిపారు. కార్యక్రమంలో రైస్ మిల్లర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బెలిదె వెంకన్న, పార్టీ రాష్ట్ర నాయకులు నరేందర్ రెడ్డి, మంతెన ఇంద్రసేనా రెడ్డి, నాయకులు అంబటి కిషన్‌రాజు, జీడి రమేష్, బూర్ల శంకర్, కోతి రాములు, రజాక్‌యాదవ్, కొంతం శ్రీనివాస్, జాకబ్ తదితరులు పాల్గొన్నారు.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి

అసెంబ్లీ కమిటీల్లో మానుకోటకు ప్రాధాన్యం

ఎస్టిమేట్స్, పబ్లిక్ అకౌంట్స్ సభ్యులుగా ఇద్దరు ఎమ్మెల్సీలు, ఇద్దరు ఎమ్మెల్యేలకు అవకాశం



ఎమ్మెల్సీ సత్యవతిరాథోడ్



ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు



పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి



ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య

మహబూబాబాద్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ అంచనాల కమిటీ, తెలంగాణ పబ్లిక్ అకౌంట్స్ కమిటీ (పీఏసీ)ల్లో మహబూబాబాద్ జిల్లాకు ప్రాధాన్యత దక్కింది. ఆయా కమిటీల్లో జిల్లాకు చెందిన ఇద్దరు ఎమ్మెల్సీలు, ఇద్దరు ఎమ్మెల్యేలకు ప్రాతినిధ్యం దక్కింది. ఆయా కమిటీల్లో సభ్యులుగా జిల్లాకు చెందిన శాసనమండలి సభ్యులు తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, సత్యవతిరాథోడ్, ఎమ్మెల్యేలు మామిడాల యశస్వినిరెడ్డి, కోరం కనకయ్యకు చోటు లభించింది. రాష్ట్రంలో అధికార, ప్రతిపక్ష పార్టీలకు చెందిన శాసనసభ్యులు, శాసన మండలి సభ్యులతో పబ్లిక్ అకౌంట్స్, ఎస్టిమేట్స్, ప్రభుత్వ రంగ సంస్థల కమిటీలను ఏర్పాటు చేస్తూ శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఒక్కో కమిటీలో చైర్మన్‌తో పాటు 12 మంది సభ్యులు ఉంటారు. ఇందులో తెలంగాణ ఎస్టిమేట్స్ (అంచనాల) కమిటీ సభ్యులుగా జిల్లాకు చెందిన ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్ రావుతో పాటు జిల్లాలోని తొర్రూరు పెద్దవంగర ప్రాతినిధ్య మండలాల పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి, బయ్యారం, గార్ల మండలాల ప్రాతినిధ్య ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, పబ్లిక్ అకౌంట్స్ కమిటీ సభ్యులుగా ఎమ్మెల్సీ సత్యవతిరాథోడ్‌కు అవకాశం దక్కింది. మహబూబాబాద్ జిల్లా నుంచి అత్యధికంగా నలుగురు ప్రజాప్రతినిధులకు అవకాశం లభించడం విశేషం.

ఎంజీఎం ఉద్యోగిపై దాడి ఘటనలో మహిళ అరెస్టు



వివరాలను వెల్లడిస్తున్న వరంగల్ ఏసీపీ నందిరాంనాయక్

మట్టెవాడ, సెప్టెంబరు 10: వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి సుమలతపై ఇనుప గొలుసుతో దాడి చేసి గాయపరిచి డబ్బులను బలవంతంగా లాక్కున్న రాజమ్మను మంగళవారం అరెస్టు చేసినట్లు వరంగల్ ఏసీపీ నందిరాంనాయక్, మట్టెవాడ సీఐ తుమ్మ గోపి తెలిపారు. ఏసీపీ నందిరాం నాయక్ కథనం ప్రకారం.. బిల్ల సుమలత 15 ఏళ్ల నుంచి ఎంజీఎంలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగిగా పనిచేస్తోంది. రెండేళ్ల నుంచి పేషెంట్ కేర్ విభాగంలో పని చేస్తోంది. ఈనెల 9న విధుల్లో భాగంగా ఎంజీఎం బయోమెట్రిక్ మిషన్ వద్ద సుమలత వేలిముద్ర వేస్తుండగా ఆలకుంట రాజమ్మ అడ్డుకొని రూ.2 లక్షలు ఇవ్వాలని, లేదంటే చంపేస్తానని బెదిరించింది. ఆపై ఇనుప గొలుసుతో సుమలతపై దాడి చేసి గాయపరిచింది. తర్వాత ఆమె చేతిలో ఉన్న సెల్‌ఫోన్ తీసుకొని పగలగొట్టి, ఆమె వద్ద ఉన్న రూ.10వేలు లాక్కొని అక్కడి నుంచి వెళ్లిపోయింది. బాధితురాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మంగళవారం రాజమ్మను అరెస్టు చేసి, ఆమె వద్ద నుంచి రూ.వేయి నగదు, ఇనుప గొలుసును స్వాధీనం చేసుకొని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ తెలిపారు.

దోషులను కఠినంగా శిక్షించాలి : ఎమ్మెల్యే

వరంగల్ మెడికల్, సెప్టెంబరు 10: ఎంజీఎం ఆస్పత్రిలో సుమలత అనే ఉద్యోగిపై జరిగిన ఘటనకు పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి స్పందించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సుమలతపై దాడిచేసిన రాజమ్మ అనే మహిళ.. గతంలో ఎంజీఎంలో విధులు నిర్వహించినప్పటికీ తనపై ఉన్న అభియోగాలవల్ల విధుల నుంచి తొలగించారని ఎమ్మెల్యే గుర్తుచేశారు. ఇలాంటి ఘటనలను ఉపేక్షించేది లేదని, నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. భవిష్యత్‌లో మళ్లీ వైద్యుల పట్ల కానీ, వైద్య సిబ్బంది పట్ల కానీ ఇలాంటి ఘటనలకు పాల్పడితే రౌడీషీట్ నమోదు చేయాలని సంబంధిత అధికారును ఆదేశించారు.

చెరువులలో గుర్రపుడెక్కను తొలగించాలి

వరంగల్ కార్పొరేషన్, సెప్టెంబరు 10: గ్రేటర్ వరంగల్ పరిధిలోని 9 చెరువులలో గుర్రపుడెక్కల ఆకులు నిండి ఉన్నాయని, గణపతి నిమజ్జనానికి గుర్రపుడెక్కల ఆకులతో అసౌకర్యంగా ఉంటుందని చిన్నవడ్డెపల్లి చెరువు ఆక్రమణ ఏరియా పరిరక్షణ సొసైటీ సభ్యులు తెలిపారు. మంగళవారం బల్దియా అదనపు కమిషనర్ చింతకుంట్ల రాజేందర్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి వినతిపత్రం అందించారు. గణేశ్ నిమజ్జనం చేసే చెరువులలో గుర్రపుడెక్క ఏపుగా పెరిగి మురిగిపోవడంవల్ల దుర్వాసన వెదజల్లుతోందన్నారు. ప్రధానంగా దేశాయిపేట చిన్నవడ్డెపల్లి చెరువు, మట్టెవాడ కోట చెరువు, ఉర్సు రంగసముద్రం, భద్రకాళి చెరువు, బెస్తం చెరువు, రంగశాయిపేట దామెర చెరువు, గొర్రెకుంట కట్టమల్లన్న చెరువు, ఖిలావరంగల్ మాల అగర్తల చెరువు, కాజీపేట బంధం చెరువులలో చెరువులు కలిపించకుండా గుర్రపు డెక్కల చెట్లు మొలిచాయన్నారు. గుర్రపు డెక్కల వల్ల వాతావరణంతో కలుషితం ఏర్పడుతోందని, వెంటనే చెరువుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. అదనపు కమిషనర్‌ను కలిసిన వారిలో పెరుమాళ్ల లక్ష్మణ్, పోతన వెంకటేశ్వర్లు, బత్తుల మల్లిఖార్జున్ ఉన్నారు.



అదనపు కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

వరంగల్ మార్కెట్ ధరలు

పంట	క్వింటా గరిష్ట	క్వింటా కనిష్ట
మక్కలు (బిల్టీరకం)	2910	2805
పల్లికాయ (సూక)	6420	4500
పల్లికాయ (పచ్చిది)	4450	3400
కందులు	8852	6750
పెసళ్లు	8000	4552
పత్తి	7700	5500
పసుపు (కాడి)	13489	10000
పసుపు (గోల)	12424	10009
తేజ మిర్చి	12000	9000
తేజ ఏసీ	18000	14000
వండర్‌హాట్ ఏసీ	16000	13000
యూఎస్341 ఏసీ	14800	11000
దేశీ ఏసీ	....	....
తాలు మిర్చి	6000	3000

- వరంగల్ వ్యవసాయం

ఆపద వస్తే అంతేనా?

(5వ పేజీ తరువాయి)

3గంటల వరకు ఎక్స్‌కవేటర్ యంత్రంపైనే బిక్కుబిక్కుమంటూ నిరీక్షించారు. ఎన్డీఆర్‌ఎఫ్‌కు చెందిన రెండు హెలికాప్టర్ల సాయంతో ఆరు గురు కూలీలను సురక్షితంగా హనుమకొండ తరలించా రు. ఇక ఈ ఏడాది ఆగస్టు 31వ తేదీ శనివారం రాత్రి వరంగల్ జిల్లా నెక్కొండ మండలం వెంకటాపూర్ చెరువు అలుగులో చిక్కుని 40మందికి పైగా ఆర్టీసీ బస్సు ప్రయాణికులు 12గంటలకు పైగా ప్రాణాలను రాత్రంతా భయంభయంగా గడిపారు. మహబూబాబాద్ జిల్లాలో మానేరు వాగులో పడి యువ వ్యవసాయ శాస్త్రవేత్త అశ్వినితో పాటు ఆమె తండ్రి మోతిలాల్ మృతి చెందారు. ఇక రాళ్లవాగులో ఐదుగురు చిక్కుకపోగా రాత్రి 11.30గంటల ప్రాంతంలో నలుగురిని సురక్షి తంగా కాపాడినప్పటికి మరొకరి ఆచూకీ లేకుండా పోయింది. 2023 జూలై 27వ తేదీ వరదలకు వరంగల్, హనుమకొండ, కాజీపేట నగరాలు నీట మునిగాయి. 200కి పైగా కాలనీలల్లో ప్రజలు పునరావాస కేంద్రాల్లో తలదాచుకోవాల్సి వచ్చింది. ఏటా వరంగల్ నగరంలో వస్తున్న వరదలకు ప్రాణ, ఆస్తి నష్టం జరుగుతూనే ఉంది. విపత్తుల నుంచి ప్రజలకు సకాలంలో సహాయం అందటం లేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

వరంగల్ కేంద్రంగా ఎన్డీఆర్‌ఎఫ్ వచ్చేనా?

ఎన్‌డీఆర్ఎఫ్ బెటాలియన్‌ను వరంగల్ కేంద్రంగా ఏర్పాటు చేయాలనే డిమాండ్ వినిపిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్(ఎస్‌డీఆర్ఎఫ్)ను ఏర్పాటు చేసింది. అగ్నిమాపక దళంలోని చురుకైన 100మంది ఉద్యోగులను ఎంపిక చేసి శిక్షణ కూడా ఇస్తుంది. ఈ ఎస్‌డీఆర్ఎఫ్ హైదరాబాద్ కేంద్రంగా పని చేస్తుండటంతో వరంగల్ కేంద్రంగా ఏర్పాటు చేయాలన్న డిమాండ్ ఎప్పటి నుంచో ఉంది. ఏటా వరంగల్‌నగరంతో పాటు గోదావరితీరంలోని ములుగు, భూపాలపల్లి జిల్లాలు, ఏజెన్సీ ప్రాంతమైన మహబూబాబాద్ జిల్లాలో ఏదో ఒక విపత్తు ఎదురవుతూ ఉంటుంది. భారీగా ప్రాణ, ఆస్తి నష్టం వాటిల్లుతుంది. దీనికి తోడు ఖమ్మం, కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, నల్లగొండ జిల్లాలకు కూడా వరంగల్ కేంద్రంగా ఎన్‌డీఆర్ఎఫ్‌ను ఏర్పాటు చేస్తే అనుకూలంగా ఉండనుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఎక్కువగా ఈ జిల్లాల్లోనే విపత్తులు సంభవిస్తుండటంతో ప్రభుత్వం ఎన్‌డీఆర్ఎఫ్‌కు చొరవ చూపాలని ప్రజలు కోరుతున్నారు. ఎన్‌డీఆర్ఎఫ్ బెటాలియన్‌ను మామునూరు 4వ బెటాలియన్‌కు అనుబంధంగా ఏర్పాటు చేసే అవకాశం ఉందని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కేంద్ర హోంశాఖ పరిధిలోనే ఎన్‌డీఆర్ఎఫ్ బెటాలియన్లు పని చేస్తున్న నేపథ్యంలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా ఉన్న కరీంనగర్ ఎంపీగా ఉన్న బండి సంజయ్ వరంగల్‌లో ఎన్‌డీఆర్ఎఫ్ ఏర్పాటుకు చొరవ చూపాలని ఓరుగల్లువాసులు కోరుతున్నారు.

ఉద్యోగులకు వేతనం ఇవ్వడానికి జేఏసీ నాయకులు ఎవరు?

హనుమకొండ టౌన్, సెప్టెంబర్ 10: ఉద్యోగులకు ముందస్తు సమాచారం ఇవ్వకుండా మూలవేతనం కట్ చేసి సీఎం సహాయ నిధికి ఇస్తామనడానికి జేఏసీ నాయకులు ఎవరని రెవెన్యూ ఉద్యోగుల నాన్ గెజిటెడ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కొండమల్ల రవి ప్రశ్నించారు. ఉద్యోగులకు రావాల్సిన బెనిఫిట్స్ గురించి ఏనాడు ప్రస్తావించని ఈ జాక్‌లు.. రూ.100కోట్లు ఇస్తామని ఒకరు, రూ.130 కోట్లు ఇస్తామని ఇంకొకరు ఎవరికి వారే ప్రకటించడం కించిస్తాయి ఉద్యోగులను కించపరచడమే అన్నారు. జాక్‌లతో తమకు ఎలాంటి సంబంధం లేదని, సీఎం సహాయనిధికి తమకు చేతనంత సహాయం తమ సంఘం తరుపున చేస్తామన్నారు. అదే విధంగా భూ సమస్యలను పరిష్కరించే దిశగా గ్రామస్థాయిలో రెవెన్యూ శాఖను బలోపేతం చేయాలన్నారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా ఉండి అన్నివిధాలుగా ప్రభుత్వానికి మంచి పేరు తీసుకొచ్చేలా కృషిచేస్తామన్నారు.

ఆంధ్రజ్యోతి WARANGAL CITY 8
వరంగల్ సిటీ
• వరంగల్ • ఖిలావరంగల్
బుధవారం 11 సెప్టెంబరు 2024



వీధికి ఇందిరానగర్‌గా నామకరణం

కాశిబుగ్గ, సెప్టెంబరు 10: కాశిబుగ్గ 19వ డివిజన్ పరిధిలోని ఇందిరిగాంధీ విగ్రహం ఉన్న వీధికి స్థానికులు ఇందిరానగర్ వీధిగా నామకరణం చేశారు. స్థానికులతో ఏర్పడ్డ శ్రీ విఘ్నేశ్వర సహకార పరపతి సంఘం, యూత్ ఆధ్వర్యంలో ఇందిరానగర్ బోర్డును మంగళవారం ఏర్పాటు చేశారు. అనంతరం మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో దాసరి రాజేష్, అంబి సాంబరాజు, కూచన రవీందర్, మామిడాల సతీష్, జయప్రకాష్, శివకృష్ణ, సతీష్, రాజేందర్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.


కాలనీ బోర్డును ఏర్పాటు చేస్తున్న స్థానికులు

రైలు నుంచి పడి చాయ్‌వాలా మృతి


బాగ్న(ఫైల్)

గిర్మాజిపేట, సెప్టెంబరు 10 : రైళ్లలో టీ విక్రయిస్తు జీవనం సాగిస్తున్న షేక్ అల్లా బాగ్న (33) వరంగల్ రైల్వేస్టేషన్‌లో బిలాస్‌పూర్ ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కపోతు ప్రమాదవశాత్తు రైలుకు, ప్లాట్‌ఫాంకు మధ్య పడి మృతి చెందినట్లు వరంగల్ జీఆర్‌పీ సీఐ టి.సురేందర్ మంగళవారం తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గుంటూరుకు చెందిన షేక్ అల్లాబాగ్న వరంగల్ నగరంలోని శివనగర్‌లో అద్దెకుంటూ రైళ్లలో టీలు విక్రయిస్తున్నాడన్నారు. సోమవారం ఉదయం వర్షం పడుతున్న సమయంలో విజయవాడ నుంచి బల్లార్ష వైపు వెళ్తున్న బిలాస్‌పూర్ ఎక్స్‌ప్రెస్ 2వ ప్లాట్‌ఫారం నుంచి బయలుదేరుతున్న సమయంలో రైల్ ఎక్కబోయిన షేక్ అల్లా బాగ్న వర్షానికి కాలు పట్టుతప్పి రైలుకు ప్లాట్‌ఫాంకు మధ్య పడి తీవ్రగాయాలతో మృతిచెందినట్లు సీఐ తెలిపారు. రైల్వేస్టేషన్‌లో టీ విక్రయదారుల నుంచి సేకరించిన సమాచారం మేరకు మృతుడిని షేక్ అల్లా బాగ్నగా గుర్తించి పోస్టుమార్టం అనంతరం తల్లి బురాన్ బీకి మంగళవారం సాయంత్రం మృతదేహం అప్పగించి హెడ్‌కానిస్టేబుల్ పి.రాజు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

వాహనదారులకు జరిమానా

మట్టెవాడ, సెప్టెంబరు 10: మద్యం తాగి వాహనం నడిపిన కేసులో 30 మంది వాహనదారులకు సోమవారం వరంగల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ గుర్రపు వీరస్వామి జరిమానా విధించినట్లు వరంగల్ ట్రాఫిక్ సీఐ రామక్రిష్ణ తెలిపారు. మద్యం తాగి వాహనం నడిపి ట్రాఫిక్ పోలీసులకు పట్టుబడ్డ 30 మంది వాహనదారులకు రూ.41,500 జరిమానా విధించినట్లు తెలిపారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం నడిపిన 15 మంది వాహనదారులకు రూ.17,200 జరిమానా విధించినట్లు వరంగల్ ట్రాఫిక్ సీఐ తెలిపారు.

శాంతిభద్రలను కాపాడాలి

శంభునిపేట, సెప్టెంబరు 10 : శాంతి భద్రతలను కాపాడుకోవడం ప్రతీఒక్కరి బాధ్యతని మామునూరు సీఐ రవికుమార్ అన్నారు. వరంగల్ కమిషనరేట్‌లో గల పోలీసు కళాబృందం ఆధ్వర్యంలో మంగళవారం బొల్లికుంట వాగ్దేవి కళాశాల వద్ద పోలీసు కళా జాతను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సీఐ రవికుమార్ పాల్గొని స్థానికులకు పోలీసు చట్టాల గురించి వివరించారు. ప్రతీ ఒక్కరు చట్టానికి అనుగుణంగా నడుచుకోవాలన్నారు. గంజాయి లాంటి మాదక ద్రవ్యాల అక్రమరవాణా, వినియోగం, అమ్మకాల జరిగే వెంటనే పోలీసులకు సమాచారమవ్వాలని కోరారు. ఈ సందర్భంగా కళాకారులు తమ ఆటపాటలతో ఆకట్టుకున్నారు. పోలీసు చట్టాలు, అసాంఘిక కార్యక్రమాలు, వాటి ఫలితాలు, చర్యలను సాంస్కృతికంగా తెలుపుతూ ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్ర మంలో ఎస్ఐలు శ్రీకాంత్, కళాబృందం కళాకారులు పాల్గొన్నారు.

చినుకు పడితే జలదిగ్బంధమే..

• ఏళ్లుగా సాగుతున్న శివనగర్ అండర్ గ్రౌండ్ డ్రైయినేజీ పనులు • ఏటా మునుగుతున్న అండర్‌బ్రిడ్జి ప్రాంతాలు • పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

ఖిలావరంగల్, సెప్టెంబరు 10: అభివృద్ధి పనులు నత్తనడకన సాగుతుండడం నగరవాసులకు శాపంగా మారింది. అండర్ రైల్వేగేట్ ప్రాంతాలు ముంపునకు గురికాకుండా అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులను ప్రారంభించారు. ఏళ్లు గడుస్తున్నా పనులు పూర్తి కాకపోవడంతో చినుకు పడిందంటే చాటు అండర్ రైల్వేగేట్ ప్రాంతాలునీట మునుగుతున్నాయి. నాలుగేళ్ల క్రితం ఖిలావరంగల్ మాలఅగర్తల చెరువు నుంచి శివనగర్ వాటర్ ట్యాంక్ మీదుగా, అలాగే చింతల్ మహంకాళీ దేవాలయం నుంచి శివనగర్ రైల్వేట్రాక్ సమీపం మీదుగా అండర్‌బ్రిడ్జి వరకు, శివనగర్ పల్లవీ ఆస్పత్రి మీదుగా మాజీ ఎమ్మెల్యే నరేందర్ ఇంటి ముందు ఉన్న డ్రైయినేజీలో కలిసే భారీ అండర్‌గ్రౌండ్ డ్రైయినేజీ పనులను నాలుగేళ్ల క్రితం అప్పటి ఐటీ శాఖామంత్రి కేటీఆర్ ప్రారంభించారు. 19నవంబరు 2020లో స్మార్ట్ సిటీ పనుల్లో భాగంగా అప్పటి ఐటీ శాఖామంత్రి కేటీఆర్ రూ.50కోట్లతో నిర్మించే అండర్ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేశారు. ఖిలావరంగల్ మాలఅగర్తల చెరువు నుంచి శివనగర్ మీదుగా అండర్‌బ్రిడ్జి వరకు 2 కిలోమీటర్ల దూరపు పనులు చేపట్టారు. ముందుగా శివనగర్ పల్లవి ఆస్పత్రి నుంచి ప్రశాంతి ఆస్పత్రి వరకు పనులను ప్రారంభించారు. ఆ తర్వాత ఎస్సీకాలనీ, పాకివాడ, శివనగర్, మసీద్, మీదుగా ప్రస్తుతం ఏసీరెడ్డినగర్ వరకు 10 ఫీట్ల లోతు, 40ఫీట్ల వెడల్పుతో పనులను చేపట్టారు. ఖిలావరంగల్ మాలఅగర్తల చెరువు నుంచి మట్టికోట సమీపంలోని శ్మశాన వాటిక వరకు పనులు జరుగుతున్నాయి.

నీటమునుగుతున్న లోతట్టు ప్రాంతాలు..

అండర్ డ్రైనేజీ పనులు పూర్తి కాకపోవడంతో శివ నగర్‌తోపాటు, అండర్‌బ్రిడ్జి, గుడిసె ప్రాంతాలు ముంపునకు గురవుతున్నాయి. 34, 35, 36 డివిజన్ల ప్రజలు తీవ్రఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇటీవల చింతల్, క్రిస్టియన్‌కాలనీ, లేబర్‌కాలనీ, వరంగల్ రైల్వేస్టేషన్ నుంచి వచ్చే డ్రైయి నేజీ, వర్షం నీటిని అండర్ డ్రైయినేజీ కాలువలో కలిపేందుకు మరో 3 మార్గాలలో డ్రైయినేజీ పనులను అధికారులు చేపట్టారు. చింతల్‌బ్రిడ్జి కింద, కట్ట మైసమ్మ దేవాలయం నుంచి వరంగల్ రైల్వేస్టేషన్‌కు వెళ్లే దారిలో డ్రైయినేజీ పనుల్లో భాగంగా మూడు నెలలుగా రోడ్డును మూసివేశారు. దీంతో ఖిలా వరంగల్ తూర్పుకోట, వంచనగిరి, స్తంభంపెల్లి, దూపకుంట, వసంతపూర్, చింత లపెల్లి, తదితర గ్రామా లతో పాటు వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌కు ట్రాక్టర్, డీసీఎం, మినీట్రాలీ, ఆటోల ద్వారా వ్యవసాయ సరుకులను తీసుకువెళ్లే రైతులు, పాఠశాలకు వెళ్లే స్కూల్ బస్సులు, పాలు, కూరగాయలను మార్కెట్‌కు తీసుకువెళ్లే వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.


శివనగర్ కమ్యూనిటీ భవనం వద్ద అండర్ గ్రౌండ్ డ్రైయినేజీ పనులు


శివనగర్ శ్మశానవాటిక వద్ద


ఇటీవల కురిసిన వర్షానికి అండర్‌బ్రిడ్జి కింద నిలిచిన నీరు

మౌలిక వసతులను కల్పించాలి
ముత్తినేని శ్రీనివాస్, పెరికవాడ



నగరంలో భారీ వర్షాల కారణంగా రోడ్లు గుంతలు పడి అధ్వానంగా మారాయి. ఇటీవల కురుస్తున్న వర్షాలకు శివనగర్, అండర్ బ్రిడ్జి, శాంతినగర్, పెరికవాడ, తదితర ప్రాంతాలలో డ్రైయినేజీలు నిండి రోడ్లపై నుంచి మురుగునీరు, చెత్తా చెదారంతోపాటు మృతజీవుల కళేబరాలు వచ్చి ఇళ్ల ముందర నిలిచి పొతున్నాయి.

అండర్‌బ్రిడ్జి చెరువులా మారుతోంది
అడప శ్రీనివాస్, అండర్‌బ్రిడ్జి



వరంగల్ నగరంలో చిన్నపాటి, భారీ వర్షం పడినప్పుడు అండర్ రైల్వేగేట్ నుంచి వరంగల్‌కు వెళ్లేందుకు బ్రిడ్జిలో పెద్దఎత్తున వర్షంనీరు చేరడంతో రాకపోకలు బంద్ అవుతున్నాయి. ప్రయాణికులు వరంగల్ రైల్వేగేట్ ఫ్లైఓవర్ బ్రిడ్జి గుండా లేదా చింతల్ ఫ్లైఓవర్ గుండా చుట్టూ తిరిగి అండర్‌రైల్వేగేట్ ప్రాంతాలకు రావాల్సి వస్తోంది.

జాతీయ సైన్స్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

సంగెం, సెప్టెంబరు 10 : మండలంలోని గవిచర్ల ప్రభుత్వ ఆదర్శ పాఠశాల విద్యార్థులు జాతీయ స్థాయి సైన్స్ పోటీల్లో పాల్గొన్నారు. మంగళవారం బెంగుళూరులో నిర్వహించిన జాతీయ స్థాయి పోటీల్లో వారు తయారు చేసిన ప్రాజెక్టులతో పోటీ పడ్డారు. పాఠశాలకు చెందిన వర్షిక్, అభిరాంలు తయారు చేసిన హైడ్రో బైస్కిల్ రాష్ట్రస్థాయిలో ఎంపికై జాతీయ స్థాయి పోటీలో పాల్గొనగా, అంతర్జాతీయ కంపెనీ షెల్ ప్రతినిధులు, అధికారులు, కర్ణాటక విద్యాశాఖ మంత్రి పాఠశాల విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రహిమాన్ ముజావర్ విద్యార్థుల గైడ్ టీచర్ రాజప్రభును అభినందించారు.


బెంగుళూరులో సైన్స్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు



విద్యా అధికారికి వినతి పత్రం సమర్పిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

కాలేజీ సమస్యలు పరిష్కరించండి

గిర్మాజిపేట, సెప్టెంబరు 10 : నగరంలోని కృష్ణకాలనీ ప్రభుత్వ బాలికల జూనియర్ కాలేజీ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కాలేజీ ప్రిన్సిపాల్ శరధృతి మంగళవారం ఇంటర్‌మీడియట్ బోర్డు వరంగల్ ప్రాంతీయ అధికారి శ్రీధర్‌సుమన్‌కు వినతి పత్రం సమర్పించారు. చిన్నపాటి వర్షం పడినా తరగతి గదులు పూర్తిగా జలమయం అవుతూ తరగతుల నిర్వహణ ఇబ్బందికరంగా మారిందని, విద్యార్థినులకు, మహిళా అధ్యాపకులకు మూత్రశాలలు లేవని, వినతి పత్రంలో పేర్కొన్నారు. కళాశాల భవనం శిథిలావస్థకు చేరి, స్లాబ్ పెచ్చులు ఊడుతూ విద్యార్థినిలపై పడుతున్నాయని వాపోయారు. భారీ వర్షాలకు కళాశాల ప్రాంగణం పూర్తిగా చెరువులా మారుతుండటం, డ్రైనేజీ నీరు కూడా ఇందులో కలుస్తుండటంతో డెంగీ, మలేరియా తదితర వ్యాధులు వచ్చే పరిస్థితి ఏర్పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు హరికృష్ణ, శ్రీనివాసశర్మ, కరుణశ్రీ, జాతీయ సేవా పథకం ప్రోగ్రాం అధికారి వనమాల ఉన్నారు.

ఘనంగా గణపతి నవరాత్రి ఉత్సవాలు

వరంగల్ కల్చరల్, సెప్టెంబరు 10: గణపతి నవరాత్రి ఉత్సవాలు మంగళవారం నాటికి నాలుగో రోజుకు చేరాయి. ఉదయం, సాయంత్రం గణపతి మండపాల వద్ద ప్రత్యేక పూజలు, అన్నదానాలు కొనసాగాయి. మంగళవారం స్టేషన్ రోడ్డులోని సునిల్ థియేటర్ వద్ద, రఘునాథ్ కాలనీలోని గణపతి అసోసియేషన్ వద్ద, జేపీఎన్ రోడ్డులో, పలుచోట్ల అన్నదానం నిర్వహించారు.

» కాశిబుగ్గ: కాశిబుగ్గ వర్తక సంఘం ఆధ్వర్యంలో గణపతి నవరాత్రులు ఘనంగా నిర్వహిస్తున్నారు. హనుమకొండ సీఎంఆర్ షాపింగ్ మాల్ స్టోర్ మేనేజర్ వెంకటరమణ 25కిలోల లడ్డూను మంగళవారం అందించారు. పూజా కార్యక్రమాల అనంతరం లడ్డూతోపాటు 60కిలోల పులిహోర ప్రసాదాన్ని భక్తులకు అందించారు. కార్యక్రమంలో వర్తక సంఘం అధ్యక్షుడు గుండేటి కృష్ణమూర్తి, గుండేటి నరేందర్, వడిచర్ల సదానందం, రాజ్‌కుమార్, కొము రయ్యా, శ్రీరాములు పాల్గొన్నారు.

» శంభునిపేట : రంగశాయిపేట రుద్రమనగర్ కాలనీలోని మండపం వద్ద మంగళగౌరీ వ్రతం, కుంకుమార్చన నిర్వహించారు.


కాశిబుగ్గలో 25కిలోల లడ్డు అందిస్తున్న సీఎంఆర్ మేనేజర్ వెంకటరమణ

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి


కాలనీ వాసులకు విద్యుత్ మీటర్లు అందిస్తున్న ఏఈ సంపత్, సురేష్

శంభునిపేట, సెప్టెంబరు 10: ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని లెనిన్‌నగర్ అబివృద్ధి కమిటీ అధ్యక్షుడు బోగి సురేష్ అన్నారు. 42వ డివిజన్ లెనిన్‌నగర్‌లో పేదల కొరకు ప్రభుత్వం అందిస్తున్న విద్యుత్ మీటర్లను ఎన్పీడీసీఎల్ ఏఈ సంపత్, లైన్‌మెన్ రఘులు సిబ్బందితో కలిసి ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ప్రవీణ్, బీమారం యాదగిరి, సూరావు విజయ్, పున్నం సుమన్, వల్లెపు దేవేందర్, మోర గోపాల్, మొగిళి, యాకయ్య, రుద్రాచారి, సంపత్ పాల్గొన్నారు.

సందడిగా జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపికలు


పరుగు పందెంలో పోటీ పడుతున్న క్రీడాకారులు

వరంగల్ స్పోర్ట్స్, సెప్టెంబరు 10: వరంగల్ జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హనుమకొండ జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం (జేఎన్ఎస్)లో జిల్లాస్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు సందడిగా ప్రారంభమయ్యాయి. వరంగల్ జిల్లా స్థాయి అండర్-8, 10, 12, 14, 16, 18, 20బాలబాలికల విభాగంలో నిర్వహించిన అథ్లెటిక్స్ పోటీలనుమంగళవారం వరంగల్ జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మూగల కుమార్‌యాదవ్ ముఖ్య అతిథిగా హాజరై లాంఛనంగా ప్రారంభించారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా స్థాయిలో అత్యుత్తమ ప్రతిభచాటి రాష్ట్రస్థాయి పోటీలలో పతకాలు సాధించాలని ఆశాభావం వ్యక్తం చేశారు. అసోసియేషన్ కార్యదర్శి యుగేంధర్‌రెడ్డి మాట్లాడుతూ.. వరంగల్ జిల్లా స్థాయిలో నిర్వహించిన అథ్లెటిక్స్ ఎంపికపోటీలలో 700మంది క్రీడాకారులు పాల్గొన్నారన్నారు. 60, 100, 150, 200, 400, 800, 1000, 1500, 3000 మీటర్ల పరుగు పందెం, డిస్కస్‌త్రో, జావెలిన్‌త్రో, హ్యామర్‌త్రో, లాంగ్‌జంప్, హైజంప్, ట్రిపుల్‌జంప్, బ్రాడ్‌జంప్, షాట్‌పుట్ విభాగాల్లో పోటీలను నిర్వహించామన్నారు. ఇక్కడ జిల్లా స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన అథ్లెట్లను ఈనెల 19, 20వ తేదీల్లో హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీలో నిర్వహించనున్న 10వ తెలంగాణ రాష్ట్రస్థాయి సౌత్‌జోన్ జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అథ్లెటిక్స్ అసోసియేషన్ హనుమకొండ జిల్లా కార్యదర్శి సారంగపాణి, పీఈటీలు వాసు, మనోజ్‌కుమార్, రజినీకాంత్ పాల్గొన్నారు.


ఐలమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

చాకలి ఐలమ్మను ఆదర్శంగా తీసుకోవాలి: ఐద్వా

ఖిలావరంగల్, సెప్టెంబరు10: తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, వీరనారి చాకలి ఐలమ్మ నేటి యువతకు ఆదర్శమని ఐద్వా రాష్ట్ర సహాయ కార్యదర్శి నలిగంటి రత్నమాల అన్నారు. మంగళవారం ఖిలావరంగల్ 38వ, డివిజన్‌లో జిల్లా ఉపాధ్యక్షురాలు ఠాగూర్ భవానీ అధ్యక్షతన ఐలమ్మ వర్ధంతిని నిర్వహించారు. రత్నమాల మాట్లాడుతూ భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం నిజాం పాలనను ఎదిరించి విసునూరి రామచంద్రారెడ్డి గుండాలను తరిమికొట్టిన వీరనారి ఐలమ్మని అన్నారు. కార్యక్రమంలో ఐద్వా నాయకులు పూరెళ్ళ రాధ, మమత, సునీత, ఆర్.స్వరూప, రాధిక, అరుణ, మౌనిక, శ్రీలత, రమ, ఎస్తేరా, రజిత, ఉమా పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీల్లో విద్యార్థుల ప్రతిభ


ప్రతిభ కనబరిచిన విద్యార్థిలతో సిబ్బంది

కరీమాబాద్, సెప్టెంబరు 10: జిల్లా స్థాయి వ్యాసరచన పోటీల్లో కరీమాబాద్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. శాంతి సంఘం స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ఉమ్మడి జిల్లా స్థాయిలో పలు విభాగాల్లో వ్యాసరచన పోటీలను నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 450 మంది విద్యార్థులు పాల్గొన్న పోటీల్లో కరీమాబాద్ పాఠశాలకు చెందిన ఐదుగురు విద్యార్థినులు ప్రతిభ కనబరిచారు. మంగళవారం కాకతీయ యూనివర్సిటీలో బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించగా ఎమ్మెల్సీ బండా ప్రకాష్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మల్లారెడ్డి చేతుల మీదుగా బహుమతులు అందుకున్నారు. ఇంగ్లిష్‌లో విజయ(ప్రథమ), తెలుగులో కీర్తన(ద్వితీయ), హిందీలోషిఫాతబస్సుం(తృతీయ) బహుమతి పొందారు.

పౌష్టికాహారాన్ని తీసుకోవాలి

శంభునిపేట, సెప్టెంబరు 10 : గర్భిణులు ఆరోగ్యంగా ఉండాలంటే పౌష్టికాహారాన్ని తీసుకోవాలని 41వ డివిజన్ కార్పొరేటర్ పోశాల పద్మస్వామి సూచించారు. శంభునిపేట అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం పోషణ అభ్యాస్ కార్యక్రమం నిర్వహించారు. కార్పొరేటర్ మాట్లాడుతూ అంగన్‌వాడీ అందిస్తున్న పౌష్టికాహారాన్ని గర్భిణులు క్రమం తప్పకుండా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కల్యాణి, హెల్త్ అధికారిణి విజయ, అంగన్‌వాడీ టీచర్‌లు భవాని, స్వర్ణలత పాల్గొన్నారు.



ఆంధ్రజ్యోతి WARANGAL RURAL బుధవారం 11 సెప్టెంబరు 2024

వరంగల్ రూరల్

• నర్సంపేట • దుగ్గొండి • చెన్నారావుపేట • ఖానాపురం • నల్లబెల్లి • నెక్కొండ • పర్వతగిరి • వర్ధన్నపేట • రాయపర్తి • సంగెం • గీసుగొండ



ఆయిల్‌పామ్ పంటను పరిశీలిస్తున్న జంగా రాఘవరెడ్డి

ఆయిల్‌పామ్ సాగును

పరిశీలించిన జంగా

పర్వతగిరి, సెప్టెంబరు 10: మండలంలోని కొంకపాక గ్రామంలో సాగుచేస్తున్న ఆయిల్‌పామ్ పంటలను రాష్ట్ర ఆయిల్‌ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి మంగళవారం పరిశీలించారు. గ్రామంలో ఆయిల్‌పామ్ పంట సాగుచేస్తున్న రైతుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం ఆయిల్‌పామ్ పంటసాగును ప్రోత్సహిస్తోందని, అవసరమైన సబ్సిడీలను అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈకార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ మోహన్ రావు, బొక్కల ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.



బెంగళూరులో జరిగిన సైన్స్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

జాతీయ సైన్స్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

సంగెం, సెప్టెంబరు 10: మండలంలోని గవిచర్ల ప్రభుత్వ ఆదర్శ పాఠశాల విద్యార్థులు జాతీయ స్థాయి సైన్స్ పోటీల్లో పాల్గొన్నారు. మంగళవారం బెంగుళూరులో నిర్వహించిన జాతీయ స్థాయి పోటీల్లో వారు తయారు చేసిన ప్రాజెక్టులతో పోటీ పడ్డారు. పాఠశాలకు చెందిన వర్షిక్, అభిరాంలు తయారు చేసిన హైడ్రో బైస్కిల్ రాష్ట్రస్థాయిలో ఎంపికై జాతీయ స్థాయి పోటీలో పాల్గొనగా, అంతర్జాతీయ కంపెనీ షెల్ ప్రతినిధులు, అధికారులు, కర్ణాటక విద్యాశాఖ మంత్రి పాఠశాల విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రహెమాన్ ముజుఫర్ విద్యార్థుల గైడ్ టీచర్ రాజప్రభును అభినందించారు.

మంత్రి పొంగులేటిని కలిసిన నేతలు

దుగ్గొండి, సెప్టెంబరు 10: మండలానికి చెందిన కాంగ్రెస్ నాయకులు మంగళవారం ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డితో కలిసి హైదరాబాద్‌లో మంత్రిని పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని కలిశారు. ఆయనను కలిసిన వారిలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తోకల శ్రీనివాస్‌రెడ్డి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్లు ఒలిగె నర్సింగరావు, చెన్నారి కిరణ్‌రెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జి మట్ట రాజు, అమ్మ రోహిత్‌లు ఉన్నారు. అదే విధంగా హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్న మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎర్రైల బాబును పరామర్శించారు.

తహసీల్దార్‌పై కేసునమోదు

పర్వతగిరి, సెప్టెంబరు 10: యజమానికి తెలియకుండా భూమిని ఇతరులకు అక్రమంగా పట్టాచేసిన ఘటనలో తహసీల్దార్ సహా ఐదుగురిపై కేసునమోదు చేసినట్లు ఎస్సై ప్రవీణ్ తెలిపారు. మంగళవారం ఆయన తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని వడ్లకొండ గ్రామానికి చెందిన ఎర్రం మల్లయ్యకు చెందిన 185/7/1 సర్వేనెంబర్‌లోని 1.25 ఎకరాల భూమిని ఆయనకు తెలియకుండా ఎర్రం దూడయ్య అనే వ్యక్తికి విరాసత్ ద్వారా పట్టాచేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు అప్పటి తహసీల్దార్ అజ్మీరా కోమి, ఎర్రం దూడయ్య వారికి సహకరించిన వెంకటేశ్వర్లు, రాజు, అఫ్సర్‌పాషాలపై కేసునమోదు చేసినట్లు ఆయన వెల్లడించారు.

ఐలమ్మ పోరాటం స్ఫూర్తిదాయకం

సంగెం, సెప్టెంబరు 10: భూమికోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం చాకలి ఐలమ్మ చేసిన పోరాటం అందరికి స్ఫూర్తిదాయకమని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఐలమ్మ వర్ధంతిని పురస్కరించుకుని మండల రజక సంఘం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల రజక సంఘం అధ్యక్షుడు బొడ్డుపల్లి వెంకట్రాజం, గౌరవ అధ్యక్షుడు మునుకుంట్ల మొహన్, ఉపాధ్యక్షులు రమేష్, పాణి, ప్రధానకార్యదర్శి యువరాజ్, కోశాధికారి రాములు, సంయుక్త కార్యదర్శి రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

● నర్సంపేట: తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా ఆమెకు మంగళవారం ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా పట్టణంలోని ఐలమ్మ విగ్రహానికి మునిసిపల్ చైర్‌పర్సన్ గుంటి రజనీకిషన్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు వెంకటనారాయణగౌడ్, నాయకులు నల్ల మనోహర్‌రెడ్డి, డాక్టర్ విద్యాసాగర్‌రెడ్డి, మండల శ్రీనివాస్, శివరాత్రిస్వామి, గోనె యవరాజ్, రజక సంఘం అధ్యక్షుడు ఐలోని శ్రీనివాస్ ఆ పార్టీ నాయకులు కార్యకర్తలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే ఐలమ్మ విగ్రహానికి సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఈసంపల్లి బాబు, పట్టణ కార్యదర్శి హన్మకొండ శ్రీధర్, బాలకృష్ణ, కందికొండరాజు, లక్ష్మీనారాయణ, నిమ్మలబోయిన రమేష్, వజ్జంతి విజయ, స్వప్న, నాగమణి, కలకోట అనిల్, జగన్నాథం, కార్తీక్ నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

● చెన్నారావుపేట : మండల కేంద్రంలోని జాగృతి విద్యానికేతన్ పాఠశాలలో ఎంసీపీఐ(యూ) పార్టీ ఆధ్వర్యంలో ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పార్టీ మండల ప్రధాన కార్యదర్శి జన్ను రమేష్ మాట్లాడుతూ నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా



నర్సంపేటలో చాకలిఐలమ్మ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

పోరాడిని వీరనారి ఐలమ్మ అని కొనియాడారు. కార్యక్రమంలో హెచ్ఎం దేవి, టీచర్ శిరీషా, గీత, కవిత, రాధిక, సృజన విద్యార్థులు పాల్గొన్నారు.

● దుగ్గొండి : మండలంలోని ముద్దునూరులో స్థానిక రజక సంఘం ఆధ్వర్యంలో ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మహ్మదాపురంలోని పాఠశాలలో హెచ్ఎం కాళిదాసు, ఉపాధ్యాయులు ఐలమ్మ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రజక సంఘం అధ్యక్షుడు రమేశ్, ఉపాధ్యక్షుడు కుమారస్వామి, సభ్యులు చేరాలు, శ్రీనివాస్, మాజీ సర్పంచ్ దేవేందర్ గౌడ్, మాజీ ఎంపీటీసీ రాము, కుమారస్వామి, చేరాలు, కారోబార్ కుమారస్వామిలు పాల్గొన్నారు.

● నెక్కొండ :ఐలమ్మ మహిళల్లో ఉద్యమ స్ఫూర్తిని నింపిందని ఏఐటీయూసీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు కందిక చెన్నకేశవులు అన్నారు. నెక్కొండలో ఏఐటీయూసీ, రజక సంఘం ఆధ్వర్యంలో ఐలమ్మ వర్ధంతి నిర్వహించారు. కార్యక్రమంలో రజక సంఘం నాయకులు రామరపు వీరస్వామి, రాము, విజేందర్, సుమన్, బొడ్డుపల్లి రాజు, బండి రామస్వామి, విజేందర్, నిఖిల్, మునుకుట్ల వెంకన్న, భిక్షం, యాదగిరి పాల్గొన్నారు.

● నల్లబెల్లి : మండల రజక సంఘం అధ్యక్షుడు ధర్మారం సాంబయ్య, మండల ప్రధాన కార్యదర్శి, గ్రామ అధ్యక్షుడు రాపాక లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో చింతకింది కుమారస్వామి, ఎంసీపీఐ మండల కార్యదర్శి దామ సాంబయ్య, మాజీ ఎంపీటీసీ వైనాల వీరస్వామి, తదితరులు పాల్గొన్నారు.

●పర్వతగిరి: మండలంలోని చింతనెక్కొండలో ఐలమ్మ విగ్రహానికి గ్రామీణ హితకారిణి సేవాసంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు గటికె మల్లయ్య పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంఘం ఆర్గనైజింగ్ కమిటీ కన్వీనర్ దబ్బెట నర్సింహులు, సభ్యులు నాగెల్లి ఉప్పలయ్య, గటికె స్వామి, దబ్బెట యాలాద్రి, సూరయ్య, కొమ్మాలు, సాయిలు పాల్గొన్నారు.

● వర్ధన్నపేట : మండల కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్‌లో ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాష్ట్ర రజక వృత్తిదారుల సమాఖ్య అధ్యక్షుడు ఇల్లందుల సాంబయ్య, ఆరెల్లి వెంటయ్య, ప్రభాకర్, ఐలయ్య, ఆరెల్లి సాంబయ్య, పెండ్యాల భిక్షపతి, పొన్నం హైమ, ఆరెల్లి ఎల్లయ్య, నేరెల్లి యాకయ్య తదితరులు పాల్గొన్నారు.

● రాయపర్తి: మండలకేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు భూక్యా సమ్మయ్య, మహమూద్, నాగేశ్వర్‌రావు, చిర్ర మల్లయ్య, మచ్చ రమేష్ పాల్గొన్నారు.

● వర్ధన్నపేట రూరల్: మండలంలోని ఇల్లందలో గ్రామ రజక సంఘం ఆధ్వర్యంలో ఐలమ్మ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో రజక సంఘం అధ్యక్షుడు మునుకుంట్ల సూరయ్య, ఎలిశాల రాజేష్, రాము, పరకాల శ్రీనివాస్, ఎలిశాల సిరిచందన్, యాదగిరి, నాగరాజు, పూర్ణచందర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాలు వెలిగిపోవాలి: రేవూరి

గీసుగొండ, సెప్టెంబరు 10: స్పెషల్ ఆఫీసర్(ఎస్‌వో)లు, కార్యదర్శులు సమన్వయంతో పనిచేసి గ్రామాలను వెలిగిపోయేలా తీర్చిదిద్దాలని ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి అన్నారు. గ్రామ ఎస్‌వోలు, కార్యదర్శులు, అంగన్‌వాడీ అధికారులతో సమావేశాన్ని ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ తాగునీటి సరాఫరా, వీధిలైట్‌లు, పారిశుద్ధ్యంపై కార్యదర్శులు ప్రత్యేక దృష్టిపెట్టాలన్నారు. జీపీలో ఉన్న నిధుల వివరాలతో పాటు, రేషన్‌షాపుల ఖాళీలు, టెక్స్‌టైల్‌పార్కు, గ్రీన్‌ఫీల్డ్ హై వే భూ నిర్వాసితుల వివరాల గురించి ఆయన ఆరా తీశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జీ ఎంపీడీవో కమలాకర్, ఎంపీవో ప్రభాకర్, ఏవో హరిప్రసాద్‌బాబు, ఏఈ సుధాకర్ పాల్గొన్నారు.

అధికారులు ప్రజల కోసం పనిచేయాలి

సంగెం: గ్రామాభివృద్ధి కోసం అధికారులు చిత్తశుద్ధితో ప్రజల కోసం పనిచేయాలని, లేదంటే శాఖ పరమైన చర్యలు తప్పవని ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి హెచ్చరించారు. మంగళవారం సంగెం మండల పరిషత్ కార్యాలయంలో మండల పరిధిలోని పలు గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ప్రత్యేకాధికారులతో సమావేశం



సంగెంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి

నిర్వహించారు. రేవూరి మాట్లాడుతూ మండల సమగ్ర అభివృద్ధికి అధికారులు ప్రభుత్వం అభివృద్దే లక్ష్యంగా పనిచేస్తూ తగిన నిధులను అందిస్తోందన్నారు. ఆ నిధులతో ప్రజలకు ఉపయోగ పడే పనులను చేపట్టాలన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారిని వేదావతి, ఎంపీవో కొమురయ్య పాల్గొన్నారు.

మహిళలు ఎదగాలి..

గ్రామీణ ప్రాంత మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి ఆకాంక్షించారు. మండల కేంద్రంలో శ్రీరామ ఎంటర్‌ప్రైజెస్, లోహిత గ్రామానికి చెందిన మదార్ మహిళ సంఘంకు కోడిపిల్లల యూనిట్, త్రివేణి స్వయం సహాయక సంఘంకు ఎలక్ట్రికల్ ఆటోను అందించి యూనిట్లను ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలంలో 593 యూనిట్లను అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో డీఆర్డీవో పీడీ కౌసల్యదేవి, అడిషనల్ డీఆర్డీవో రేణుకాదేవి, డీపీఎంలు భవానీ, సరిత, సుధాకర్, ఏపీఎం కిషన్, యూనియన్ బ్యాంకు మేనేజర్ అనిల్, ఎంపీడీవో రవీందర్ పాల్గొన్నారు.

మోదీ పాలనలో దేశం అభివృద్ధి

బీజేపీ జిల్లా ప్రధానకార్యదర్శి గోగుల రాణాప్రతాప్‌రెడ్డి

నర్సంపేట,సెప్టెంబరు 10: ప్రధానినరేంద్రమోదీ పాలనలో దేశం అన్ని రంగాలలో అభివృద్ధి చెందుతోందని బీజేపీ జిల్లా ప్రధానకార్యదర్శి గోగుల రాణా ప్రతాప్‌రెడ్డి అన్నారు. నర్సంపేట పట్టణంలో మంగళవారం పార్టీ సభ్యత్వనమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సభ్యత్వ నమోదులో జిల్లాలోనే నియోజకవర్గం ముందంజలో నిలిచేలా పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు కంభంపాటి ప్రతాప్, రేసుశ్రీనివాస్, నియోజకవర్గకన్వీనర్ వడ్డెపల్లి నర్సింహరాములు, అజ్మీర శ్రీనివాస్, ఓబీసీ మోర్చా, రాష్ట్ర అధికార ప్రతినిధి గడ్డం ఆంజనేయులు, బీజేవైఎం నియోజకవర్గ కన్వీనర్ ఆముదాల రమేశ్, పార్లమెంట్ కోకన్వీనర్ కట్ల రాంచంద్రారెడ్డి పృథ్వీరాజ్, పట్టణ ప్రధానకార్యదర్శులు కొంపెల్లి రాజు, గూడూరు సందీప్ తదితరులు పాల్గొన్నారు.

● చెన్నారావుపేట: గ్రామాల్లో బీజేపీ సభ్యత్వ నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని రాణాప్రతాప్‌రెడ్డి అన్నారు. మండలంలోని లింగగిరిలో పార్టీ సభ్యత్వ నమోదును ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు దుంకదువ్వల రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

● దుగ్గొండి: మండలంలోని స్వామిరావుపల్లిలో నిర్వహించిన సభ్యత్వ



నర్సంపేటలో సభ్యత్వ నమోదును ప్రారంభిస్తున్న గోగుల రాణా ప్రతాప్‌రెడ్డి

నమోదు కార్యక్రమంలో రాణా ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమంలో మండల బీజేపీ అధ్యక్షుడు నెదురు రాజేందర్, మోకిడె ప్రభాకర్, చెల్పూరి రాజు, కాతబాజీ చిరంజీవి, బొమ్మగాని రమేశ్, బానోతు వెంకటేశ్, నూతనకంటి శ్రీనివాస్, అన్నలింగన్న, సందీప్, సంతోష్, మధు, యాదగిరి నవీన్ పాల్గొన్నారు.

● నెక్కొండ: సభ్యత్వ నమోదులో నియోజకవర్గంలో నెక్కొండ మండలం ముందుండాలని నర్సంపేట నియోజకవర్గ నాయకులు కంభంపాటి పుల్లారావు, మాజీ ఎంపీపీ గటిక అజయ్‌కుమార్ కోరారు. నెక్కొండలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని వారు ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి మల్యాల వినయ్‌కుమార్, ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి పంజాల రాము, జిల్లా లీగల్ సెల్ కన్వీనర్ సొంటిరెడ్డి వేణుగోపాల్‌రెడ్డి, నాయకులు అంబాల రాంగోపాల్, రాపాక సందీప్, తదితరులు పాల్గొన్నారు.

రాజన్న ఆలయ హుండీ లెక్కింపు

వర్ధన్నపేట రూరల్, సెప్టెంబరు 10 : మండలంలోని రాజరాజేశ్వరస్వామి ఆలయ హుండీని మంగళవారం లెక్కించారు. స్వామి వారి ఆదాయం రూ. 40,250 వచ్చినట్లు ఆలయ ఈవో అద్దంకి నాగేశ్వర్‌రావు, ఇన్‌స్పెక్టర్ అనిల్ వెల్లడించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు గద్దం సమ్మయ్య, గుంటి కుమారస్వామి పాల్గొన్నారు.

బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించాలి

గీసుగొండ, సెప్టెంబరు 10: బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌లు కల్పించిన తరువాతే స్థానిక ఎన్నికలు నిర్వహించాలని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు డిమాండ్ చేశారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌లు కల్పించాలని డిమాండ్ చేస్తూ చాపర్తి కుమార్‌గాడ్గే గీసుగొండలో చేస్తున్న దీక్షకు ఆయన మంగళవారం మద్దతు తెలిపి మాట్లాడారు. బీసీ కుల గణన యుద్ధప్రాతిపదికన ప్రభుత్వం చేపట్టాలన్నారు. కార్యక్రమంలో నాయకులు నేదునూరి రాజమౌళి, బత్తిని సదానందం, తిరుపతి, శ్యాం తదితరులు పాల్గొన్నారు.

సాగులో ఆరుతడి పద్ధతిని అవలంబించాలి



ఖానాపురంలో రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

ఖానాపురం, సెప్టెంబరు 10: మండలంలోని ధర్మారావుపేటలోని వరి పొలాలను వీధి ఇంపాక్ట్ సర్వీస్, మిట్టి ల్యాబ్‌కు చెందిన అమెరికా, స్పెయిన్‌కు చెందిన శాస్త్రవేత్తల బృందం మంగళవారం పరిశీలించారు. పొలంలో ఎక్కువ మోతాదులో నీటి నిలువ ఉండడం వల్ల మీథేన్ గ్యాస్ ఉత్పత్తి అవుతుందని, ఇది పర్యావరణంపై ప్రభావం చూపుతుందని శాస్త్రవేత్తలు చిన్‌మై, బేడ్‌మేన్, కియోగో అన్నారు. మీథేన్ గ్యాస్ నివారణ కోసం ఆరుతడి పద్ధతి (ఆల్టర్‌నేటివ్ వెట్ అండ్ డ్రై)పై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వీధి ఇంపాక్ట్ సర్వీస్ జిల్లా మేనేజర్ ఎస్ రాజు, ఎఫ్‌వో రాజు, ఏఎఫ్‌వోలు మాధురి, చిరంజీవి, ఉస్మాన్ పాల్గొన్నారు.

● వర్ధన్నపేట: రబీ సీజన్‌లో ఆరుతడి పంటలు సాగు చేయడం ఎంతో మేలని ఏడీఏ నర్సింగం అన్నారు. మంగళవారం వర్ధన్నపేట పట్టణంలోని రైతువేదికలో రైతునేస్తం కార్యక్రమంలో భాగంగా జరిగిన టెలీ కాన్ఫరెన్స్‌కు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక ఎకరానికి వరికి అవసరమయ్యే నీరుతో నాలుగు ఎకరాల ఆరుతడి పంటలు సాగు చేసుకోవచ్చునన్నారు. రబీలో ఆరుతడి పంటలైన వేరుశనగ, మొక్కజొన్న, నువ్వులు తదితర పప్పు ధాన్యాలు సాగు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో విజయ్‌కుమార్‌రెడ్డి, ఏఈవో మౌనిక, రైతులు పాల్గొన్నారు.

‘సర్పంచ్ ఏకగ్రీవం’పై అధికారుల విచారణ

● ఆలయాల నిర్మాణానికి ఒకరు అంగీకారం తెలిపారన్న గ్రామస్థులు

● ఎన్నిక ఏమీ లేదంటూ వాంగ్మూలం ఇచ్చిన తండావాసులు



తండాలో విచారణ జరుపుతున్న అధికారులు

పర్వతగిరి, సెప్టెంబరు 10: సర్పంచ్ ఎన్నికలకు నోటిఫికేషన్ రాకముందే ఓ తండాలో సర్పంచ్ ఎన్నిక ఏకగ్రీవమైందంటూ వచ్చిన వార్తలు వరంగల్ జిల్లాలో తీవ్ర చర్చనీయాంశమయ్యాయి. ఈ నేపథ్యంలో అధికారులు మంగళవారం ఆ తండాను సందర్శించి గ్రామస్థులను విచారించారు. వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం చెరువుకొమ్ముతండాలో జరిగిన ఈ ఘటనకు సంబంధించిన వివరాలివీ. తండాకు చెందిన బానోత్ బాలాజీ అనే వ్యక్తి గ్రామంలో మూడు ఆలయాలు నిర్మించడంతో పాటు ఇంటికి రూ.వెయ్యి చొప్పున ఇచ్చేందుకు అంగీకరించడంతో అతడిని గ్రామస్థులు సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారంటూ వార్తలు వచ్చాయి. దీంతో ఎంపీడీవో మాలోత్ శంకర్‌నాయక్, ఎంపీవో పాక శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శి రమాదేవి మంగళవారం ఆ తండాకు వెళ్లి పాఠశాల ఆవరణలో గ్రామస్థులతో సమావేశం నిర్వహించారు.

సర్పంచ్‌గా ఎన్నికైనట్లు ప్రచారం జరిగిన ధరావత్ బాలాజీతో పాటు తండావాసులను విచారించారు. అనంతరం ఎంపీడీవో మాట్లాడుతూ బాణోతు బాలాజీ అనేవ్యక్తి తండాలో అందరి సహకారంతో విరాళాలు సేకరించి ఆలయాలను కట్టించడంతో పాటు బొడ్రాయిని ప్రతిష్ఠించేందుకు చర్చలు జరిపారని, చందాలు సేకరించిన సొమ్ముతో ఆలయాల నిర్మాణాలు పూర్తయ్యాక మిగిలితే ఇంటింటికీ పంచుతానని అతడు చెప్పినట్టు అంగీకరించాడన్నారు. అంతేకాని సర్పంచ్ ఏకగ్రీవ ఎన్నిక గురించి తమ సమావేశంలో ఎలాంటి ప్రస్తావన రాలేదని, కేవలం గ్రామంలో ఆలయాల నిర్మాణం, అభివృద్ధి గురించి మాత్రమే చర్చించుకున్నామని బాలాజీతో పాటు తండావాసులు తమకు లిఖితపూర్వకంగా వాంగ్మూలం ఇచ్చినట్టు ఎంపీడీవో తెలిపారు.

గ్రామాల్లో వైద్య శిబిరాలు

దుగ్గొండి, సెప్టెంబరు10: మండలంలోని వెంకటాపురంలో మంగళవారం నర్సంపేట మెడికల్ కళాశాల ప్రొఫెసర్లు మెగా వైద్య శిబిరం నిర్వహించారు. 221 మందికి వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు అందించారు. ఈ సందర్భంగా డిప్యూటీ డీఎంహెచ్‌వో ప్రకాశ్, అసోసియేట్ ప్రొఫెసర్ ఎల్ మురళిలు మాట్లాడుతూ వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతిఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు కిరణ్‌రాజు, పార్వతి, జ్యోతి, వాసవి, అర్జున్ రెడ్డి, చంద్రశేఖర్, బీ రాజు, అక్షిత, దివ్యారావ్, జయరాజ్, మహేందర్‌రెడ్డి, విజయ్ కుమార్, భరత్‌కుమార్, పృథ్వీ, వనమాల, దుర్గారాణి, సలోమి, హెచ్ఈవో సాంబయ్య, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

నెక్కొండ : ప్రజలకు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ఆరోగ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో ప్రకాశ్, డాక్టర్ గోపాల్‌రావు, జిల్లా వైద్యారోగ్య శాఖ ప్రోగ్రాం అధికారి మోహన్ సింగ్ ఆదేశించారు. మంగళవారం మండలంలోని అలంకానిపేట శివారు గిరిజన తండాల్లో ఇంటింటికి వెళ్లి రోగులకు వైద్య సేవలందించారు. కార్యక్రమంలో వైద్యారోగ్య అధికారులు, డాక్టర్లు అర్చన, సుమన్, మలేరియా అధికారి నందు, వైద్య సిబ్బంది రవిచంద్రారెడ్డి, సంజీవ్‌కుమార్, సుజాత, సరోజ పాల్గొన్నారు.

● ఖానాపురం: మండలంలోని అయోధ్యనగర్, భద్రుతండాల్లో పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు నిర్వహించారు. గ్రామస్థులకు డాక్టర్లు సతీష్, రాకేష్, రుచితలు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం గ్రామాల్లో దోమల నివారణ మందులను పిచికారీ చేయించారు.

ప్రజలు సంతోషంగా ఉండాలి

రాయపర్తి, సెప్టెంబరు 10: ప్రజలు ఎల్లప్పుడూ సంతోషంగా ఉండాలని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఝాన్సీరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని గట్టికల్లు గ్రామంలో పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం గ్రామ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణపతి నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం వర్షానికి నష్టపోయిన రైతులను పరామర్శించి, ఆదుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు హమ్యానాయక్, మండల అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, మేరుగు సంతోష్, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

గణపతికి దీపారాధన

వర్ధన్నపేట రూరల్: మండలంలోని ఇల్లంద గ్రామంలో అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మహిళలు మంగళవారం 1001 దీపాలతో శివలింగ ఆకారా దీపారాధన నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం నిర్వాహకులు జోగుల సంపత్, తాండ్ర రాజశేఖర్, షైదం వెంకటేష్, మంద శ్రీకాంత్, పోన్నాల నాగరాజు, శ్రావణ్, సంతు, సాయి, కుమార్, అరవింద్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

నాలుగోరోజు గణపతులకు ప్రత్యేక పూజలు

నర్సంపేట, సెప్టెంబరు 10 : గణపతి నవరాత్రోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు మంగళవారం పట్టణంలోని అన్ని గణపతి మండపాల్లో ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. అందులో భాగంగా పట్టణంలోని పద్మశాలీ గార్డెన్‌లో మహిళలు సామూహిక కుంకుమార్చన చేశారు. పూజలో బాల్నె జగన్, కామని రవీందర్, కోడూరి రవి, గోపాలకృష్ణ, వెంగల భిక్షపతి, రాజేందర్, పర్శ శ్రీధర్, మహిళా సంఘం ప్రధాన కార్యదర్శి కోడాటి అనిత, రుద్రమల్లీశ్వరి పెండెం లక్ష్మి, తుమ్మ పద్మ తదితరులు పాల్గొన్నారు.

అలాగే పట్టణంలోని సిద్ధార్థనగర్‌లో ఏర్పాటు చేసిన గణపతికి ఏసీపీ కిరణ్ కుమార్, డిప్యూటీ తహసీల్దార్ ఆకుల రవి, పీఆర్‌టీ యూ జిల్లా అధ్యక్షుడు డీ రవీందర్‌రెడ్డి, జర్నలిస్టు అబ్బు వెంకట్‌రెడ్డి, బీజేపీ నాయకుడు నర్సింహరాములు, వెటర్నరీ డాక్టర్ శ్రీకాంత్, మట్ట మధుసూదన్‌రెడ్డి, సిద్ధార్థ డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ గోగుల ప్రభాకర్‌రెడ్డి, సృజన, హైమావతి, శోభారాణి, వినోద, సునీత, రజిత, సారంగపాణి, రవిచందర్, రాంబాబు, రాజు గణపతికి పూజలు పాల్గొన్నారు.

త్వరలోనే ఏకీకృత సర్వీస్‌రూల్స్

గీసుగొండ, సెప్టెంబరు 10: త్వరలోనే ఉపాధ్యాయుల ఏకీకృత సర్వీస్ రూల్స్ సాధిస్తామని పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు పింగిళి శ్రీపాల్‌రెడ్డి అన్నారు. ధర్మారం హైస్కూల్‌లో మంగళవారం నిర్వహించిన పీఆర్టీయూ సర్వసభ్య సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. మోడల్‌స్కూల్ ఉపాధ్యాయులకు 010 పద్దు ద్వారా వేతనాలు చెల్లించటం, కేజీబీవీ ఉపాధ్యాయునిలకు మినిమం టైం స్కేల్, పీజీహెచ్ఎంలకు ప్రమోషన్‌లు, అన్ని యాజమాన్య ఉపాధ్యాయులకు హెల్త్ కార్డులు, డీఎస్సీ 2003 ఉపాధ్యాయులకు పాత పెన్షన్ ఇప్పించేందుకు పీఆర్టీయూ కృషిచేస్తుందన్నారు. అనంతరం మండల కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శిగా మార్త శ్రీనివాస్, అసోసియేట్ అధ్యక్షులుగా బొల్లం రవి, ఇందిరాదేవి, ఉపాధ్యక్షులుగా మాలతి, బాలరాజు, కార్యదర్శులుగా పద్మజ, స్వాతిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు ఈదునూరి రవిందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి అబ్దుల్‌గఫార్, శంకర్‌రావు, దయాకర్, రాజు, పట్టాభి, మహేందర్, సుధాకర్, రఘు, విజయ్, రాజేందర్‌లు పాల్గొన్నారు.